జూన్ 6వ వరకు 144 సెక్షన్ పొడిగింపు

ఏలూరు సిటీ, మే 15 : జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అనగా జూన్ 6 వతేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని ప్రాంతాల్లో శాంతి భద్రతలకు అవాంతరం కలిగే అవకాశం ఉన్నందున ఈనెల 14వ తేదీ వరకు ఉన్న 144 సెక్షన్‌ను జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగియనున్న జూన్ 6వ తేదీ వరకు పొడిగించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు సమయంలో చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధం. ప్రజలు గుంపులు, గుంపులుగా , ఐదుగురు కంటే ఎక్కువగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



ఏలూరు క్రైం, మే 15 : ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత నిర్వహిస్తున్న ఉద్యోగులు అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంపీ, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఈవీఎం బాక్స్‌లను భద్రపరిచి మూడంచెల భద్రత కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా ఆ ప్రాంతాలను సందర్శించి అక్కడ ఉన్న భద్రతా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న అధికారులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అన్ని వేళల భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎస్పీతో పాటు డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు, త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు, ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళీకృష్ణ ఉన్నారు.

కూటమి పాసవుతుందా?

> ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం ఏ 'బటన్' నొక్కారు.. ఎవరివైపు గాలి వీచింది?.. కూటమి పాసైందా... ఓట్ల బదిలీ సంపూర్తిగా జరిగిందా? అధికార వైసీపీ ఎత్తుగడలకు దీటుగా ఏలూరు జిల్లాలో సక్సెస్ పథాన నడిచారా? అనుకున్నట్లుగానే జన ఆమోదం పొందారా.... ఈ ప్రశ్నలు అన్నింటికి కూటమిలో అవుననే వినిపిస్తోంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎవరి లెక్కలు వారివి..

- పరస్పర ఓట్ల బదిలీ సక్రమంగానే సాగిందా?
- మూడు పార్టీలు వేస్తున్న లెక్కలన్నీ విజయానికి దగ్గరగానే..
- ఈసారి జనసేన బలమే అదనం..వ్యతిరేకతే వైసీపీకి నష్టం
- పోలింగ్ సరళిపై వీటన్నింటిపైన ప్రభావం

ముచ్చటగా మూడు సక్సెస్ అయిందా? పోలింగ్ ముగిసినా ఫలితాలకు ఇంకా సమయం ఉన్నా, ఎక్కడ చూసినా అన్ని పార్టీల్లోనూ ఈ ఎన్నికల్లో ఎవరిపోకడ ఎలా సాగింది, జనం ఏవైపు మొగ్గు చూపారు? అన్ని అనుకున్నట్టుగానే గాలే వీచిందా... లేదా పథకాల వైపు వెళ్ళిందా? ఇప్పుడు అందరి తర్జనభర్జన ఇదే. ఏలూరు జిల్లా వ్యాప్తంగా కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పక్షాలు ప్రచారంలో ఎంత దూకుడుగా వ్యవహరించాయో అంతే దూకుడుగా జనం కూటమి వైపు మొగ్గు చూపారా? పరస్పరం ఓటర్లు పొత్తు వైపు మొగ్గారా? లేదా? అనే విచిత్రమైన ప్రశ్న వినబడుతోంది. ఓట్ల బదిలీ ముఖ్యమంటూ అటు తెలుగుదేశం, ఇటు జనసేన ఎన్నికల ప్రచారంలోనూ పదేపదే చెప్పాయి. దీనికి తగ్గట్లుగానే ఓటర్లు పరిణతి చెంది ఆ దిశగా పయనించారా? లేదా? అన్నదే ప్రశ్నకు కూటమి నేతలు, స్థానికంగా ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన వారు అంతా అవుననే చెబుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, టీడీపీ, బీజేపీ పక్షాలు ఉమ్మడిగా తరలాయి. ఏ గ్రామంలోనూ ఈ మూడు పార్టీలు విభేదాలకు దిగలేదు. పరస్పర సమన్వయం కోసం మూడు పార్టీలతో కమిటీగా ఏర్పడి పోలింగ్ వరకు ప్రజా మద్దతును కూడకట్టుకుని ముందుకు తీసుకెళ్లారు. కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు వ్యవహరించిన తీరు ఆయన విజయానికి బంగారు బాట వేసిం దంటూ కూటమినేతలు ఒక అంచనాకు వచ్చారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ ఎత్తుగడలను పోలింగ్‌రోజు అంతకు ముందు ఎక్కడికక్కడ తిప్పికొట్టడం కూటమి ఐక్యతకు ఒక సంకేతంగా పరిగణించారు. పోలింగ్ అనంతరం నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లో తాము తిరుగులేని ఆధిక్యత సాధిస్తామని, ఆ వెనువెంటే ఉంగుటూరు ఉంటుందని కూటమి నేతలు బలంగా లెక్కలు వేశారు. ఈ నియోజక వర్గంలో ఉన్న సామాజిక వర్గాల్లో అత్యధికులు కూటమి వైపే మొగ్గు చూపారంటూ గ్రామాల వారీగా విశ్లేషిస్తున్నారు. ఇదే తరుణంలో అధికార వైసీపీ సైతం తాము స్వల్ప మెజార్టీతో గట్టెక్కుతామన్న ధీమాతో ఉంది. అయితే కూటమిలో ఓట్లు బదిలీ, సంతృప్తికరంగా సాగినందున ఇక్కడ వైసీపీ వ్యూహం దెబ్బతిందని, ఇంకొందరు చెబుతున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో నువ్వానేనా అన్నట్లుగా సాగిన ఎన్నికల్లో ఓవైపు జనసేన, టీడీపీ కార్యకర్తలు ఒకటై నిలిచారు. గ్రామాల్లో అక్కడక్కడ కూటమికి పొగబెట్టడానికి ప్రయత్నాలు జరిగినా ఆదిలోనే వాటిని తుంచివేయడంలో జనసేన, టీడీపీ విజయం సాధించినట్టు ఇంకొక అంచనా. ఇలా కలిసి రావడం కారణంగానే మూడు మండలాల్లోనూ సైలెంట్ ఓటింగ్ టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌కు అనుకూలంగా ఉన్నట్టు కూటమి వాదన. ఇంకోవైపు వైసీపీ మహిళా ఓటర్లు, తటస్తులు, పథకాలు పొందిన లబ్ధిదారులు తమవైపే మొగ్గు చూపారని గాలి తమవైపే వీచిందన్న ధోరణిలోనే ప్రచారం సాగిస్తున్నారు.

ఏలూరులో నువ్వానేనా అనే రీతిలో పోలింగ్ సాగింది. తగ్గట్లుగానే పోలింగ్‌కు ముందురోజు నుంచే కూటమి అభ్యర్థికి సానుకూల సంకేతాలు అందాయని, కీలకమైన ఏలూరు నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ బలమైన సామాజిక వర్గాల నుంచి హామీ లభించడం ఆ దిశగానే పోలింగ్‌రోజున ఓటర్లు కదిలి వెళ్ళారంటూ టీడీపీ విశ్లేషిస్తోంది. తొలిసారిగా అసెంబ్లీకి పోటీచేసిన బడేటి చంటి నేరుగా అన్ని వర్గాల్లో నిలదొక్కుకోవడం జనసేన పక్షాన తగినంత సహకారం లభించడం అది కూడా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ కేడర్ నేరుగా టీడీపీ అభ్యర్థికి మద్దతుగా కదలడం, ఓటు బదిలీ సక్సెస్‌కు నిదర్శనంగా కూటమి విశ్లేషిస్తోంది. ఈ నియోజక వర్గంలో సీనియర్ నేత, పలుమార్లు అసెంబ్లీకి పోటీ చేయడం, ఎన్నికైన వైసీపీ అభ్యర్థి ఆళ్ళ నాని వ్యూహాలను చేధించటంలోనూ తామే సక్సెస్ అయ్యామని బీజేపీ కూడా సానుకూలంగా కదిలిందనే భావిస్తున్నారు. అయినా వైసీపీ తాము ఏలూరును చేజిక్కించుకోవడం ఖాయమని, ఇప్పటికి ధీమాతోనే ఉంది.

నూజివీడు నియోజకవర్గంలో ఆదినుంచి పడిలేస్తూ వచ్చిన తెలుగుదేశం పోలింగ్ నాడు కొంత నిలదొక్కుకోవడానికే ప్రయత్నించింది. ఏ పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదన్నట్లుగా టీడీపీ ధైర్యం చేయగా, ఆ వెనువెంటే జనసేన నడిచింది. ఈ నియోజకవర్గంలో ఆదినుంచి టీడీపీకి పట్టు ఉండడంతో వ్యూహం, ప్రతివ్యూహం కూడా ఆ పార్టీదే. ఈ సారి ఎన్నికల్లోనూ అధికార వైసీపీని ఢీ కొట్టడానికి సర్వశక్తులు ఒడ్డారు. ప్రతికూలతను అనుకూలంగా మలుచుకునేందుకు చివరిక్షణం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇంకొక విచిత్రం ఏమిటంటే ఈ నియోజకవర్గంలోనే భారీ పోలింగ్ సాగింది. వీరిలో అత్యధికులు సైలెంట్‌గా బటన్ నొక్కారు. అదంతా కూటమి పక్షానే ఉంటుందని తెలుగుదేశం అంచనా. పెద్ద మెజార్టీ రాకపోయినా ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తమదే పైచేయి అవుతుందని విశ్లేషిస్తున్నారు. వైసీపీ మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ తమ వ్యూహం బలంగా పనిచేసిందని, ప్రభుత్వ వ్యతిరేకత ఒట్టి ప్రచారం మాత్రమేనని ఇక్కడ తమ నాయకుడు ప్రతాప్ అప్పారావు పేరుమీదే అంతా సానుకూలత వ్యక్తమైందని ఇప్పటికి వాదిస్తున్నారు.

కైకలూరులో నువ్వానేనా అని సాగిన పోలింగ్‌లో అనూహ్యంగా ఓటింగ్ శాతం కూడా రికార్డు స్థాయిలో నమోదైంది. ఇక్కడ జనసేన, ఆసాంతం బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని వైపే ఆదినుంచి మొగ్గు చూపింది. నోటిఫికేషన్ ముందుకంటే ఆ తర్వాత అటు తెలుగుదేశం, ఇటు జనసేన, బీజేపీ అభ్యర్థికి కుడి, ఎడమలుగా బలంగా పనిచేశాయి. ఈ కూటమిలో అనుకూలంగా ఉన్న వారిలో చీలిక తెచ్చేందుకు వైసీపీ వేయని ఎత్తుగడ లేదు. అయినా పోలింగ్ రోజున కూడా కూటమి వైపే గాలివీచిందనే నమ్మకంతో నేతలు ఉన్నారు. వైసీపీ, స్థానిక ఎమ్మెల్యే మీద ఉన్న వ్యతిరేఖతే తమకు అనుకూలంగా మారిందన్న ధీమాతో ఉన్నారు. వైసీపీ మాత్రం గతంకంటే తాము పుంజుకున్నామని తమకు ఢోకా లేదని వాదిస్తోంది.

రిజర్వుడ్ రెండింటిలో ఇలా..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన చింతలపూడి, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన పోలవరంలోనూ కూటమి, వైసీపీ మధ్య నువ్వానేనా అన్నట్లుగా యుద్ధమే సాగింది. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ కేవలం పార్టీ పరంగానే ఓటర్లు తమదైన నిర్ణయం తీసుకునే ప్రయత్నం చేసినట్టు విశ్లేషిస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఆదినుంచి బలంగా ఉన్న టీడీపీకి జనసేన తోడు అవ్వడం మరింత బలాన్ని ఇచ్చింది. ఈ రెండింటి బలం పోలింగ్ వరకు ఉమ్మడిగా సాగింది. భారతీయ జనతా పార్టీ కూడా అన్ని గ్రామాల్లో ముందుకు సాగింది. ఎటు తిరిగి మండలాల వారీగా కాకున్నా చింతలపూడి, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలు పార్టీలు విజయానికి కీలకంగా మారాయి. ఈ రెండింటిలోనూ తమ గాలే వీచిందని కూటమి, కాదు మావైపే ఉందంటూ వైసీపీ ఆసాంతం ధీమా వ్యక్తం చేశాయి. కూటమిలో సమన్వయం, ప్రభుత్వ వ్యతిరేఖత, జనసేన సంపూర్ణ మద్దతు వివిధ వర్గాల నుంచి స్వచ్ఛంద అనుకూలత పోలింగ్ నాడు తమవైపు గాలి మళ్ళేలా చేసిందని కూటమి అభ్యర్థి రోషన్ అనుకూలురు ధీమాతో ఉన్నారు. తెలుగుదేశం అంచనాలకు భిన్నంగా వైసీపీ స్వల్పమెజార్టీతోనైనా తాము విజయం సాధిస్తామని పక్కాగా లెక్కలతో చెబుతోంది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం పోలవరంలోనూ, ప్రచారంలో పోటీలు పడిన కూటమి వైసీపీలు రెండూ ఓటర్ల మద్దతు కూడకట్టుకోవడానికి రేసుగుర్రాల్లా పనిచేశాయి. కూటమి పక్షాన కీలకంగా ఉన్న తెలుగుదేశం ఏ మండలంలోనూ వెనుకంజ వేయకుండా తమ పార్టీశ్రేణులను బలంగా ముందుకు నడిపింది. లోలోన కొంత అసంతృప్తి ఉన్నా నేతల జోక్యంతో ఇవన్నీ సమసిపోయాయి. దీనికి తోడు అభ్యర్థి చిర్రి బాలరాజు పక్షాన జనసేన నేతలు, మరో సీనియర్ నేత కరాటం రాంబాబు, టీడీపీ నేత బొరగం శ్రీనివాస్ కొమ్ము కాయడంతో గిరిజన గ్రామాల్లో అనేకం పవన్ పార్టీ వైపే మొగ్గు చూపారని, ఇప్పటికి కూటమి గాఢంగా నమ్ముతోంది. వైసీపీ మాత్రం తమకు ఇక్కడ కొత్త అభ్యర్థి వచ్చినా సానుకూలతలో మాత్రం మార్పులేదనే విశ్వాసంతో ఉంది.

కాకసనూరు సంప్రదాయ స్వాగతంపై ఈసీఐ ఎక్స్ వేదికగా ట్వీట్



ఏలూరు సిటీ, మే 15 : భారత ఎన్నికల కమిషన్ ఎక్స్ వేదికగా ఏలూరు జిల్లా కాకసనూరు గిరిజన తండా సంప్రదాయ స్వాగతంపై ట్వీట్ చేసింది. స్వీప్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టిని ఆకర్షించింది. పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం వేలేరుపాడు మండలం కోయిదా పంచాయతీ పరిధిలో కాకసనూరు గిరిజన తండా ఉంది. ఇక్కడ అందరు కొండ్రెడ్డి తెగకు చెందిన వారు కావడం విశేషం. కాకసనూరు తండా ఏలూరు జిల్లా కేంద్రానికి 180 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే సుమారు మూడు గంటలు పాటు ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు మార్గం ద్వారా కోయిదా చేరుకుని అక్కడ నుంచి గోదావరిలో పడవ ప్రయాణం గంట పాటు చేసి కాకసనూరు తండా చేరుకోవాలి. ఎన్నికల్లో భాగంగా 472 ఓటర్లు ఉన్న కాకసనూరు పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ ఏర్పాటు చేశారు. ర్యాండమైజేషన్ పద్ధతిలో ప్రిసైడింగ్ అధికారి శ్రీధర్ బృందానికి పోలింగ్ నిర్వహించే అవకాశం వచ్చింది. కాకసనూరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఓటర్లు కూడా పేరంటాల పల్లి, టేకుపల్లి నుంచి కాకసనూరు వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. మే 12న గోదావరి నదిలో ప్రయాణించి కాకసనూరు తండాకు ఎన్నికల బృందం వెళ్లేటప్పటికి అర్ధరాత్రి అయింది. గిరిజనులు తమ సంప్రదాయాలకు అనుగుణంగా ఎన్నికల సిబ్బందికి పూల దండలు వేసి స్వాగతం పలికారు. యువకులు రాత్రంతా జాగారం చేసి సిబ్బందికి రక్షణగా పోలీసులతో పాటు ఉన్నారు. గతంలో భిన్నంగా అక్కడ 92 శాతం పోలింగ్ జరిగింది. ఈ ప్రాంత గిరిజనులు చూపిన ఆదరణకు ఎన్నికల సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన సంప్రదాయంలో స్వాగతం పలికిన తీరును తెలుసుకున్న భారత ఎన్నికల సంఘం ఎక్స్ వేదికగా ఫొటోలు అప్‌లోడ్ చేసి వివరాలతో ట్వీట్ చేసింది. ఎన్నికల కమిషన్ ట్వీట్‌కు విశేష స్పందన రావడంతో విషయం తెలుసుకున్న కాకసనూరు గిరిజన తండా వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

పోటెత్తిన మహిళా ఓటర్లు

- 82.71 శాతం మంది ఓటు హక్కు వినియోగం
- పురుష ఓటర్ల కంటే 16,533 మంది మహిళా ఓటర్లు అధికంగా ఓటేశారు
- మహిళా ఓటర్ల తీర్పుపైనే రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు



పోలింగ్ సందర్భంగా సోమవారం ఇసుకపాడులో ఓటు వేయడానికి భారీగా క్యూలో ఉన్న గిరిజన మహిళలు

ఏలూరు సిటీ, మే 15 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మహిళా ఓటర్ల చైతన్యం వెల్లివిరిసింది. ఈ ఎన్నికల్లో ఓటింగ్ చేయడానికి మహిళా ఓటర్లు పోటెత్తారు. సోమవారం పోలింగ్ సమయం పూర్తయిన తర్వాత కూడా క్యూలైన్లో గంటల తరబడి నిలబడి ఎంతో ఓపికగా మహిళా ఓటర్లు ఓటు వేయడం చూస్తుంటే వారి తీర్పు ఏ విధంగా ఉంటుందోనన్న విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలో 82.71 శాతం మహిళా ఓటింగ్ నమోదు కావడం గమనార్హం.

ఎన్నికల రోజు ఉదయం నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద పురుష ఓటర్లతో సమానంగా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మహిళలు ఓటు వేయడానికి అత్యంత ఆసక్తి కనబరిచారు. వృద్ధ మహిళలు అనారోగ్యంతో ఉన్నా కొంత మంది ఓటు వేయడం పలు పోలింగ్ బూత్‌లలో కనిపించింది. విభిన్న ప్రతిభావంతుల్లో కూడా మహిళలే ఎక్కువగా ఓటు వేయడానికి ముందుకొచ్చారు. ఇక కొత్తగా ఓటు వచ్చిన వారిలో యువతులు ఎక్కువ మంది పాల్గొనడం, పట్టణాల్లో అయితే తొలిసారి ఓటు వచ్చిన విద్యార్థినులు అధిక సంఖ్యలో ఓటు వేయడం గమనార్హం. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే ఈ సారి మహిళలు ఎటువైపు మొగ్గు చూపారన్నదే చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు మహిళా ఓటింగ్‌పై మల్లగుల్లాలు పడుతున్నారు. తమకు అంటే తమకు ఓటు వేశారని వారు పేర్కొంటున్నారు. కొంతమంది అభ్యర్థులైతే స్థానికంగా సర్వేలు చేయించుకుంటూ తమ పార్టీకే అధికంగా మహిళలు ఓటు వేశారని చెబుతున్నారు. జూన్ 4న ఫలితాల అనంతరం మహిళా ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపారో తెలియనుంది.

నియోజక వర్గాల వారీగా మహిళా ఓటింగ్..

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా మొత్తం 8,38,063 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో సోమవారం నిర్వహించిన పోలింగ్ కార్యక్రమంలో 6,93,172 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మహిళా ఓటర్లలో 82.71 శాతం మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా మహిళా ఓటర్ల పోలింగ్ పరిశీలిస్తే ఇలా ఉంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 1,04,886 మంది మహిళా ఓటర్లకు 90,678 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. దెందులూరులో 1,15,089 మందికి 97,538 మంది, ఏలూరులో 1,22,872 మందికి 79,607 మంది, పోలవరం 1,31,212 మందికి 1,06,077 మంది, చింతలపూడిలో 1,38,733 మందికి 1,10,679 మంది, నూజివీడులో 1,20,867 మందికి 1,05,051 మంది, కైకలూరు నియోజకవర్గంలో 1,04,404 మందికి 89,384 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రకారం పరిశీలిస్తే జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే తమ ఓటు హక్కు వినియోగించుకుని తమ సత్తా చాటారు.

83.68

పెరిగిన పోలింగ్ శాతం

- పోస్టల్ బ్యాలెట్‌తో మరో 1.15 శాతం పెరుగుదల
- జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో పోలింగ్ శాతంపై ప్రభావం



ఏలూరు సిటీ, మే 15 : జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సగటున 83.68 శాతం నమోదైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో 16లక్షల 37వేల 430 మంది ఓటర్లు ఉండగా ఇందులో 13 లక్షల 70వేల 153 ఓట్లు పోలయ్యా యి. అదే విధంగా 7లక్షల 99వేల 241 మంది పురుషులకు 6లక్షల 77వేల 056 ఓట్లు నమోదు కాగా , 8లక్షల 38వేల 063 మంది మహిళా ఓటర్లు ఉండగా వారిలో 6లక్షల 93వేల 045 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇతరులు 126 మంది ఉండగా వారిలో 52 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్‌లు పరిశీలిస్తే 18 వేల 201 అంటే 1.15 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1,614, దెందులూరు-2,165, ఏలూరు-3,123, పోలవరం- 2,872 , చింతలపూడి- 2,267, నూజివీడు- 1,923 , కైకలూరు - 1,651 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కున్నారు. వారిలో ఎన్నికల విధులకు హాజరయ్యే 15 వేల 615 మంది సిబ్బంది కాగా, 43 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. 85 ఏళ్ల దాటిన వారు 500 మంది, విభిన్న ప్రతిభావంతులు 369 మంది, అత్యవసర సర్వీస్‌కు సంబంధించి సిబ్బంది 1,674 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అవే కష్టాలు..!

తిరుగు ప్రయాణంలో ఓటర్లకు తప్పని తిప్పలు

- సరిపడ బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ
- ప్రైవేట్ బస్సులు ఛార్జీల బాదుడు



ఏలూరు కొత్త బస్టాండులో విజయవాడ నాన్‌స్టాప్ టికెట్లు ఇచ్చే చోట బారులు తీరిన ప్రయాణికులు

ఏలూరు రూరల్, మే 15 : ఓటు వేసేందుకు ఉత్సాహంగా స్వస్థలాలకు తరలివచ్చిన ఓటర్లకు తిరిగి వెళ్ళేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. రైళ్ళల్లో రిజర్వేషన్‌లు ఫుల్ అయ్యాయి. ఆర్టీసీ సరిపడా బస్సులు నడపడంలో విఫలమైంది. ప్రైవేట్ బస్సుల్లో ఛార్జీలు ఏకంగా 200 శాతంకు పైగా పెరిగాయి. ఓటు వేసేందుకు గతంలో ఎన్నడూలేని విధంగా భారీగా ఓటర్లు తమ స్వస్థలాలకు తరలివచ్చారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా తదితర నగరాలతో పాటు పలు రాష్ట్రాల్లో వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా ఉంటున్న వారంతా ఓటు వేసేందుకు వచ్చారు. శని, ఆదివారాలు సెలవు కావడం, సోమవారం పోలింగ్ అవ్వడంతో ఓటు వేయడంతో పాటు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో గడిపే అవకాశం ఉంటుందనే భావనతో జిల్లాకు వచ్చారు. మంగళవారం తిరిగి వెళ్ళకూడదనే సెంటిమెంట్‌తో చాలామంది బుధవారం తిరుగుముఖం పట్టారు. ఏలూరు జిల్లాలోనే సుమారు 40 వేల మందికి పైగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు తరలి వచ్చినట్లు అంచనా. అయితే తిరిగి వెళ్లే సమయంలో వారికి ప్రయాణ పాట్లు తప్పలేదు. రైళ్ళల్లో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. దీంతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. స్వస్థలాలకు ఓటు వేసేందుకు వచ్చేవారి కోసం బస్సులు నడిపిన ఆర్టీసీ తిరిగి హైదరాబాద్ తదితర ఇతర ప్రాంతాలకు వెళ్ళేందుకు సరిపడా బస్సులు నడపడంలో విఫలమైంది. ఏలూరు కొత్త బస్టాండు బుధవారం విజయవాడ, హైదరాబాద్ వెళ్ళేవారితో నిండిపోయింది. సరిపడా బస్సుల్లేక అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. దీంతో ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సి వచ్చింది. ఇదే అదనుగా ప్రైవేట్ బస్సుల ఛార్జీలు భారీగా పెంచేశారు. సాధారణంగా రూ.వెయ్యి ఉండే హైదరాబాద్ టిక్కెట్ ధరను రూ.2 వేలకు పెంచేశారు.



ఏలూరు కొత్త బస్టాండులో ప్రయాణికుల రద్దీ

నేటి నుంచే ఏపీఈఏపీ సెట్ పరీక్ష

- 16, 17 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష
- 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ పరీక్ష
- ఏలూరులో మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

ఏలూరు రూరల్, మే 15 : ఏపీఈఏపీ సెట్ 2024 పరీక్ష గురువారం నుంచి మొదలు కానుంది. 16, 17 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష, 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ పరీక్ష నిర్వహిం చనున్నారు. జిల్లాలో ఏలూరులో మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్, ఏలూరు ఇంజనీరింగ్, సిద్ధార్థ క్వెస్ట్ కళాశాలలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇంజనీరింగ్ పరీక్షకు 4,315 మంది, అగ్రికల్చర్, మెడిసిన్ పరీక్షకు 1,910 మంది మొత్తం 6,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం షిఫ్ట్ పరీక్షగా 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష షిఫ్ట్‌గా 2గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం గంట ముందు నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఉండదు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రికల్ వస్తువులు అనుమతించబడవు.

కురుములతోగులో డయేరియా

- వాంతులు విరేచనాలతో వృద్ధురాలి మృతి
- మరో ఎనిమిదిమందికి అస్వస్థత
- బావినీరే తాగడమే కారణమా..?
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు



కురుములతోగులో పారిశుధ్య చర్యలు

కుక్కునూరు, మే 15 : మండల పరిధిలోని దామరచర్ల పంచాయతీ కురుములతోగు ఆదివాసి గ్రామంలో డయేరియా ప్రబలింది. బుధవారం గ్రామానికి చెందిన దారం బుజ్జమ్మ (65) మృతి చెందగా మరో ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు బాచిన సత్యనారాయణకు తెలవడంతో ఆయన మీడియాకు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది అప్రమత్తమై గ్రామానికి వెళ్ళి ఆరేళ్ళ మడకం దేవయ్య, ఆరు నెలల వయస్సు ఉన్న చిన్నారులు కల్లూరి శాంతి, మడియం సంజన, కూనం మంగయ్య, వెట్టి లక్ష్మి, పొడియం యర్రమ్మ, మరో ఇద్దరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న విషయం గుర్తించి వైద్యసేవలందించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం గ్రామంలో వర్షం కురిసింది. వారంతా వాగు పక్కనే ఉన్న ఓ బావిలో ఉన్న నీటిని తాగునీటిగా వాడుకుంటున్నారు. వర్షపునీరు ఆ బావిలోకి వెళ్లగా ఆ నీటినే తాగునీటిగా ఉపయోగించడంతో గ్రామస్థులు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం నుంచి వాంతులు, వీరేచనా లతో బాధపడుతూ బుజ్జమ్మ మృతి చెందినట్టు ఆది వాసీలు తెలిపారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ గ్రామంలో పారిశుద్య మెరుగుకు చర్యలు చేపట్టారు. తాగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. బావిలో నీరు తాగవద్దని ఆదేశాలు జారీ చేశారు. అమరవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనంత్ మాట్లాడు తూ మెరు గైన వైద్యం కోసం ఒకరిని ప్రభుత్వాస్పత్రికి తరలించామని మిగిలిన వారిని గ్రామంలోనే ఉంచి వైద్యం చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. దాదాపు 25 ఏళ్ల క్రితం చత్తీస్‌ఘడ్ ప్రాంతం నుంచి ఆదివాసీలు వలస వచ్చి కురుములతోగు గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ కారణంగా ఆ గ్రామానికి రహదారి, విద్యుత్‌సౌకర్యం, మంచి నీటి బోరు తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. వాగునీరు, బావిలో ఉన్న నీరు తాగునీటిగా ఉపయోగించుకోవడంతో తరచుగా అనారోగ్యం పాలవుతున్నారు. రెండేళ్ల క్రితం కూడా ఇదే పరిస్థితి తలెత్తి దాదాపు 20 మంది వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



మృతి చెందిన బుజ్జమ్మ





అనారోగ్యంతో ఉన్న ఆదివాసీలు

గో'దారి' ఎటువైపు..!



- అందరి కళ్ళు గోదావరి జిల్లాల మీదే
- ఇక్కడ మెజార్టీ వస్తే రాష్ట్రంలో అధికారం వచ్చినట్టే
- జోరుగా సాగే పందేల్లో ఇదే పరమార్థం
- గెలుపు, ఓటములపై వెనక్కి తగ్గని కూటమి, వైసీపీ
- పాత సెంటిమెంట్లు పునరావృతం కాగలవని ఆశలు



ఏలూరు, ఆంధ్రజ్యోతి (ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే రాష్ట్రప్రజల దృష్టి అంతా గోదావరి జిల్లాల వైపే ఉంటుంది. ఇక్కడ ఓటర్లు ఏ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీనే అధికార పగ్గాలు అందుకోవడం ఖాయం. ఇప్పుడు జరిగిన ప్రతిష్టాత్మక పోరులో కూటమి ఓ వైపు, వైసీపీ ఇంకోవైపు మోహరించి ఎన్నికల యుద్ధం చేశాయి. అత్యంత కీలకమైన సామాజికవర్గాల పక్షాన జనసేనతో కలిసి టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడి, వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆఖరికి మంత్రులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లోనూ సైలెంట్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందో తెలియక విలవిల్లాడుతున్నారు. గోదావరి జిల్లాల్లో రాజకీయక్షేత్రంలో జనసేన పాత్ర ఈసారి అత్యంత కీలకంగా మారింది. బీజేపీ కూడా జత కలవడంతో దీమాగా ముందుకు సాగారు. అధికార వైసీపీ సైతం కూటమిని ఢీకొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ఆర్థిక సామాజిక వర్గాలను టార్గెట్ చేసి ఎత్తుగడలు వేసింది. గ్లాస్ జోరందుకోకుండా సైకిల్ స్పీడ్ అందుకోకుండా అడ్డుకట్ట వేసేందుకు విఫలయత్నం చేసింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో ఎవరు బలం ఎంత ? 2014 నాటి ఫలితాలే పునరావృతం అవుతాయా? లేదా? అనేదే ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ..



అప్పుడు..ఇప్పుడు అంతే

2014 నాటి ఎన్నికలు, పోలింగ్ సారూప్యత ఈ ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. అప్పట్లో తెలుగుదేశం, బీజేపీ పొత్తును ఓటర్లు స్వాగతించారు. అనూహ్యంగా జగన్ పార్టీని వెనక్కి నెట్టారు.ఒకానొక దశలో ఈ కూటమిని ఢీకొనేందుకు ఎన్ని ఎత్తుగడలు వేసినా అది ఫలించనే లేదు. ఆది నుంచి తెలుగుదేశం వివిధ పార్టీలతో ఎన్నికల పొత్తుకు దిగుతూనే ఉంది. వీటిలో కొన్నిసార్లు అధికారపగ్గాలు చేజిక్కించుకోవడం, టీడీపీకి సాధ్యమైంది. కాని 2019లో మాత్రం ఒంటరిగా రంగంలోకి దిగిన టీడీపీ తీవ్ర నష్టాన్నే చవిచూసింది. అప్పుడు జరిగిన చేదు అనుభవంతో ఈసారి రణక్షేత్రంలోకి దిగే ముందే వ్యూహాత్మకంగా టీడీపీ ఆచితూచి వ్యవహరించింది. జనసేన చేయి అందుకుని ఆ వెనువెంటనే కమలం భుజం తట్టి పోరుకు సిద్ధమైంది. ఈ కూటమిపక్షాన సీట్లు సర్దుబాటు ఒకానొక దశలో కష్టతరంగా మారినా అందులో ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో పార్టీ ఐడెంటిటీ పొత్తు కారణంగా దెబ్బతింటుందని, ఎక్కువ నియోజకవర్గాలు జనసేనకు కాని, బీజేపీకి కాని వదిలేయవద్దంటూ తెలుగుదేశంలో సీనియర్లు పార్టీపై ఒత్తిడి తెచ్చారు. కాని ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా వైసీపీని సాగనంపటానికి తెలుగుదేశం కూడా గోదారి ఒడ్డున త్యాగాలకు ఓర్చింది. తెలుగుదేశం అత్యంత కీలకంగా భావించే స్థానాలను కూడా పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఆఖరికి ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును సైతం ఒప్పించి ఉంగుటూరు నియోజకవర్గాన్ని జనసేన చేతిలో పెట్టింది. ఈ పరిణామాలు ఓటర్లలో పరస్పర చర్చకు దారితీశాయి. గోదావరి జిల్లాలు అంటేనే తెలుగుదేశం పార్టీకి ఊపిరి. ఈ జిల్లాలో వచ్చిన మెజార్టీతోనే ప్రతిసారి అధికారపగ్గాలు చేజిక్కించు కోవ డానికి తెలుగుదేశానికి ఓ అదృష్టంగా ఉండేది. అలాంటిది ఈసారి జిల్లాలో సగానికి సగం స్థానాల్లో మిత్రపక్షాలైన జనసే, బీజేపీకి కేటాయిం చింది.

ఎవరెకి ఎన్ని..? అంతటా ఇదే ఆరా

గోదారి జిల్లాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే బెట్టింగ్‌లకు దిగడం ఆనవాయితీ. ఈ బెట్టింగ్‌లే పార్టీ అభ్యర్థుల విజయ అవకాశాలను కాస్త దగ్గరగా ఉండేలా చేస్తాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో అత్యంత కీలకం కావడం ఒక ఎత్తు అయితే కూటమి పక్షాన నిలబడిన అభ్యర్థులు వైసీపీకి నేరుగా సవాళ్ళు విసిరారు. ఈ క్రమంలో ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటరీ స్థానాలు ఉండగా వీటిలో మెజార్టీ కూటమి గెలుచుకోగలదని, 2014 నాటి ఫలితాలు పునరావృతం కావడం ఖాయమని జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. భీమవరం కేంద్రంగా సాగే బెట్టింగ్‌ల్లో నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు లోక్‌సభ స్థానం కూటమి కైవశం చేసుకోగలదనే దిశగానే వెళుతున్నాయి. మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్య నారాయణల ఓటమి ఖాయమని కొందరు పందేలు కాస్తున్నారు. 2014 లోనూ ఈ తరహాలోనే బెట్టింగ్‌లు సాగిన దిశగానే ఫలితాలు కూడా వెలువడ్డాయి. 2014 ఎన్నికల్లో కూటమిపక్షాన నరేంద్ర మోదీ భీమవరం వచ్చారు. ఇప్పుడు ఇదే నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు పర్యటించడం సెంటుమెంట్‌గా భావిస్తున్నారు. బీజేపీ అగ్రనేతలు ప్రచారానికి రావడం తమ విజయ అవకాశాలకు పెంచడమేనని ఇక్కడి నేతలు భావిస్తారు. ఏలూరు లోక్‌సభ స్థానంలో పుట్టా మహేష్, నరసాపురం లోక్‌సభ స్థానంలో శ్రీనివాస్‌వర్మ గెలుపుపైన 14 అసెంబ్లీ నియోజకవర్గాలను స్వీప్ చేస్తారని కొందరు బెట్టింగ్‌లకు దిగగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9 నుంచి 11 కూటమికి 4 స్థానాలు వైసీపీకి దక్కుతాయని, ఇంకొందరు ఓ అంచనాకు వచ్చారు.

అంతా ఒక్కటై.. కలిసిమెలిసి

గోదావరి జిల్లాల్లో ఏ పార్టీకి ఆపార్టీ తన మద్దతుదారులను కూడకట్టుకుని తనదే పైచేయి కావాలని ప్రతిసారి కోరుకుంటూ వస్తూనే పొత్తుకు దిగటం, అదేరీతిలో దీటుగా గెలుపొందటం జరుగుతూ వచ్చింది. గత ఎన్నికల్లోనూ జనసేన ఒంటరిగా పోటీ చేసినప్పుడు చింతలపూడి, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, ఉండి, నరసాపురం, తణుకు వంటి నియోజకవర్గాల్లో తనదైన బలం చూపింది. ఆఖరికి నిడదవోలులోనూ సత్తాచాటే ప్రయత్నం చేసింది. అప్పట్లో జనసేనకు ఈ నియోజకవర్గాలు అన్నింటిలోనూ ఐదెంకెల మేర ఓట్లు లభించాయి. అంటే ఒంటరిగా పోటీ చేసినా సొంత బలం ఉన్న పార్టీగా జనసేన గోదావరి జిల్లాలో తనదంటూ ఒక ముద్ర వేసింది. అప్పటికి ఇప్పటికి తేడా ఏంటంటే ఉమ్మడిగా ఉన్నందున ఇది అన్నదమ్ముల అనుబంధమని, ఇప్పటి కూటమిన అటు జనసేన కార్యకర్తలు, ఇటు బీజేపీ కార్యకర్తలతో పాటు టీడీపీ ఉమ్మడిగా అభ్యర్థుల వెంటే ఉన్నారు. ప్రచారంలోనూ, వ్యూహాల్లోనూ కలిసి నడిచారు. విభేదానికి తావులేకుండా చీలికలకు తావులేకుండా వ్యవహరించి పోలింగ్‌కు ముందే జనామోదం పొందారు. దీంతో ఓటర్లలోనూ కూటమి తన సానుకూలతను రెండింతలు చేసుకోగలిగింది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన పోలవరంలోనూ తన పార్టీ అభ్యర్థిగా చిర్రిబాలరాజును రంగంలోకి దింపటం ఆర్థికంగా కాస్త వెనుకబడిన అభ్యర్థి అయినప్పటికి తెలుగుదేశం ఏ మాత్రం వెనుకంజ వేయకుండా భుజం కాచింది. ఇదంతా ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాల్లోనూ కూటమిలో నేతలు, కార్యకర్తలు ఒకేమాట, ఒకే ఓటు అనే రీతిలో విజయానికి చేరువయ్యే క్రమానికి చేర్చగలిగిందని విశ్లేసిస్తున్నారు.ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కైకలూరు నియోజక వర్గంలో ఉన్న జనసైనికులు ఈసారి ఎన్నికల్లో కీలకంగా నిలిచారు. ఎలాంటి అరమరికలు లేకుండా బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని వెంటే పరుగులు తీశారు. నరసాపురంలో జనసేన అభ్యర్థికి పార్టీ టీడీపీ నీని యర్లు, బీజేపీలో అనుకూలురు పూర్తిస్థాయిలో ఐక్యంగా నిలిచి ముందుకు నడిపించారు.

కొన్ని రైళ్లు రద్దు..మరికొన్ని పొడిగింపు



నరసాపురం, ఏలూరు క్రైం, మే 15: విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొన్ని రైల్వే ట్రాక్‌లు మరమ్మతుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేశారు. వేసవికాలంలో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా 20 రైళ్లను పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 12 రైళ్ళను ఈనెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ రద్దు చేశారు. గురువారం నుంచి ఈనెల 26 వరకు పలు డెమో రైళ్లను రద్దు చేస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో 07897 ఉదయం 3.25కి నెంబర్‌తో ఉదయం 3.25కు నరసాపురంలో బయలుదేరి నిడదవోలు వెళ్లే డెమో, 07771 నెంబర్‌తో నిడదవోలు నుంచి ఉదయం 6.45కి నరసాపురం వచ్చే డెమో, 17270 నెంబర్‌తో ఉదయం 9.45కు నరసాపురం, విజయవాడ వెళ్లే డెమో,07862 నెంబర్‌తో విజయవాడలో మధ్యాహ్నం 2.20కు నరసాపురం వచ్చే డెమో, 07883 నెంబర్‌తో రాత్రి 8.10కి నరసాపురం నిడదోదలు వెళ్లే డెమో, ఉదయం 5.15కి 07884 నెంబర్‌తో నిడదదోలు- భీమవరం మధ్య నడిచే డెమో రైళ్లు ఉన్నాయి. అలాగే 07466 నెంబర్‌తో రాజమండ్రి- విశాఖపట్టణం, 07467 నంబర్‌తో విశాఖపట్టణం నుంచి రాజమండ్రి 22701 నెంబరుతో విశాఖపట్టణం -గుంటూరు,22702 నంబర్‌తో గుంటూరు-విశాఖపట్టణం, 17239 నంబర్‌తో గుంటూరు - విశాఖపట్టణం నడిచే రైళ్లను రద్దు చేశారు

పొడిగించిన రైళ్లు :

06071 ఎర్నాకుళం-నిజాముద్దీన్ (శుక్రవారం) జూన్ 7 నుంచి జూన్ 28 వరకూ
06072 నిజాముద్దీన్-ఎర్నాకుళం (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06073 చెన్నై- భువనేశ్వర్ (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06074 భువనేశ్వర్ - చెన్నై (మంగళవారం) జూన్ 11 నుంచి జూలై 2 వరకూ
06077 చెన్నై ఎగ్మోర్ -సత్రగంజి (శనివారం) జూన్ 1 నుంచి జూన్ 29 వరకూ
06078 సత్రగంజి- చెన్నై ఎగ్మోర్ (సోమవారం) జూన్ 3 నుంచి జులై 1 వరకూ
06079చెన్నై ఎగ్మోర్-సత్రగంజి (మంగళవారం)జూన్ 4 నుంచి జూలై 2 వరకూ
06080 సత్రగంజి - చెన్నై ఎగ్మోర్ (బుధవారం)జూన్ 5 నుంచి జూలై 3 వరకూ
06081 కొచ్చివెల్లి - షాలిమర్ (శుక్రవారం) జూన్ 7 నుంచి 28 వరకూ
06082 షాలిమర్ - కొచ్చివెల్లి (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06089 తాంబ్రం - సత్రగంజి (బుధవారం) జూన్ 5 నుంచి జూలై 3 వరకూ
06090 సత్రగంజి - తాంబ్రం (గురువారం) జూన్ 6 నుంచి జూలై 4 వరకూ
06095 తాంబ్రం - సత్రగంజి (గురువారం) జూన్ 6 నుంచి జూలై 4 వరకూ
06096 సత్రగంజి - తాంబ్రం (శుక్రవారం) జూన్ 7 నుంచి జూలై 5 వరకూ
06103 నాగర్ కోయల్- డిబ్రూగర్ (శుక్రవారం) జూన్ 7 నుంచి జూన్ 21 వరకూ
06104 డిబ్రూగర్-నాగర్‌కోయల్ (బుధవారం) జూన్ 12 నుంచి జూన్ 26 వరకూ
06105 నాగర్‌కోయర్ -డిబ్రూగర్ (శుక్రవారం) జూన్ 14 నుంచి జూన్ 28 వరకూ
06150 డిబ్రూగర్ -నాగర్‌కోయల్ (బుధవారం) జూన్ 19 నుంచి జులై 3 వరకూ
06181 కోయంబత్తూర్-భగత్‌కీకుట్టీ (గురువారం)మే 30 నుంచి జూన్ 27 వరకూ
06182 భగత్‌కీకుట్టీ-కొయ్యంబత్తూర్ (ఆదివారం)జూన్ 2 నుంచి జూన్ 30వరకూ

నిట్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం అర్బన్, మే, 15 : ఏపీ నిట్‌లో వచ్చేనెల 3వ తేదీ నుంచి 7 వరకు 8,9,10 తరగతి విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయశర్మ తెలిపారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ శిక్షణా ఉంటుందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99854 57227, 90101 01065 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

21న భీమవరంలో క్రికెట్ ఎంపిక పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, మే 15:పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -15, 19, 23 ఏళ్ల బాలికల సీనియర్ క్రికెట్ ఎంపిక పోటీలు ఈనెల 21న భీమవరం, డీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు అసోసి యేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సొంత కిట్ కలిగి 21న ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని తెలి పారు. క్రీడాకారులు 2009, 9వ నెల 1వ తేదీలోపు 15 ఏళ్లు పూర్తి అయిన వారు, అలాగే 2011, 8వ నెల 31వ తేదీకి 19 ఏళ్లు, 2005, 9వ నెల,1వ తేదీకి 23 ఏళ్లు పూర్తయిన వారు అర్హులన్నారు. ప్లేయర్స్ పుట్టిన తేదీ జిరాక్స్ కాపీలు, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం 25 వేల దరఖాస్తులు

నూజివీడు టౌన్, మే 15: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థుల నుంచి ఇప్పటివరకు 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కంట్రోలర్ గోపాలరాజు తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ) క్యాంపస్‌లలో నాలుగు వేల సాధారణ సీట్లు మరో 400 సూపర్ న్యూమనరీ సీట్లకు ఈనెల 8వ తేదీ ఆర్జీయూకేటీ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల 25వ తేదీవరకు 10వ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని వెల్లడించింది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన మొదటివారం రోజుల్లో నాలుగు క్యాంపస్‌లలోనూ అడ్మిషన్ల కోసం 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో జూన్ 24 నుంచి 28 వరకు బ్లాక్‌చైన్ టెక్నాలజీపై ఎఫ్‌డీపీ

భీమవరం ఎడ్యుకేషన్, మే 15 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 24 నుంచి 28 వరకు జాతీయస్థాయిలో సైబర్ సెక్యూరిటీ బ్లాక్ చైన్ టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహి స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల డైరెక్టర్ జగపతిరాజు బుధవారం కళాశాలలో విడుదల చేశారు. ప్రోగ్రాం కన్వీనర్ కృష్ణం రాజు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీలో నూతన టెక్నాలజీపై ఫ్యాకల్టీకి అవగాహన కల్పిస్తారన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు. కోఆర్డినేటర్స్ డాక్టర్ రవికిరణ్‌వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కవిత వ్యవహరిస్తున్నారు. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సభ్యులు

స్వర్ణమయ పథకానికి 57.580 గ్రాముల బంగారం



ద్వారకాతిరుమల, మే 15: శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి కాళ్ల మండలం పెదఅమిరానికి చెందిన చంద్రశేఖర్ బుధవారం 57.580 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఏఈవో మెట్టపల్లి దుర్గారావు విరాళం రసీదు అందించారు. దీని విలువ సుమారు రూ.4 లక్షల వరకూ ఉంటుందని అధికారులు చెప్పారు.

పెదమల్లం మాచేనమ్మ జాతర ప్రారంభం

ఆచంట, మే 15 : పెదమల్లం మాచేనమ్మ శ్రీపల్లాలమ్మ అమ్మవార్ల జాతర మంగళవారం రాత్రి ప్రారంభమైంది. అమ్మవార్ల జాతర నిప్పులగుండం కార్యక్రమాలు వచ్చేనెల 3,4 తేదీలలో నిర్వహిస్తామని ఈవో రాము తెలిపారు. అమ్మవార్లను మంగళవారం రాత్రి నిలబెట్టి జాతర పూర్తయ్యేవరకు ప్రతీరోజూ గరగలతో సాయంత్రం ఇంటింటికి తిప్పుతారు. సుమారు 20 రోజుల పాటు ప్రతీరోజూ గ్రామంలో అమ్మవారిని ఊరేగిస్తారు.

18 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

22 రాత్రి స్వామివారి కల్యాణం

18 నుంచి 25 వరకూ ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల, మే 15: ద్వారకాతిరుమల చిన్న తిరుమలేశుని వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 25 వరకూ వైఖానస ఆగమ యుక్తంగా జరుగనున్నాయి. దీనికోసం ఆలయ పరిసరాలలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పాత కల్యాణ మండపం ముందు శ్రీవారు, అమ్మవార్ల భారీవిద్యుత్ కటౌట్ ఏర్పాటుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి. ఆలయ గోపురాలకు ఇప్పటికే విద్యుత్ తోరణాలను అమర్చారు. పాదుకా మండపం వద్ద, శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం ముందు తాటిఆకుల పందిర్లను నిర్మిం చారు.బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 25 వరకు నిత్యార్జిత కల్యా ణా లను, ఆర్జితసేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈవో వేండ్ర త్రినాదరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మ వార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా చేస్తారు. 19న ధ్వజారోహణ, 21న ఎదుర్కోలు ఉత్సవం, 22న రాత్రి 8-30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న రాత్రి 7-30 గంటలకు రథోత్సవం, 24న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజ అవరోహణ, 25న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం,రాత్రి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.



విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది





స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులు.., ధ్వజస్తంభం వద్ద నిర్మించిన తాటాకు పందిరి

మొక్క..మాను అవుతోంది సామీ..

గోపురాలపై పిచ్చిమొక్కలు

మొక్కే కదా అని వదిలేస్తే.. అది మాను అవుతోంది. శ్రీవారి ఆలయ ప్రధాన రాజ గోపురాలపై పిచ్చి మొక్కలు పెరుగుతున్నా అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. మరో రెండు రోజుల్లో రానున్న బ్రహ్మోత్సవాల నిమిత్తం గోపురాల చుట్టూ విద్యుత్ తోరణాలను అమర్చిన అధికారులకు ఈ పిచ్చిమొక్కలు కనిపించక పోవడం శోచనీయం. ఏళ్ల తరబడి ఆలయ గోపురాలపై పెరుగుతున్న పిచ్చిమొక్కల కారణంగా శిల్ప సౌందర్యాలు కళా విహీనం కాగా గోపురాలు దెబ్బతినే ప్రమాదం పొంది ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.







శ్రీవారి రాజగోపురంపై పెరుగుతున్న మొక్కలు

విద్యార్థుల హృదయాల్లో మా'స్టార్'

22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అందరి మన్ననలు



భవానీ శంకర ప్రసాద్

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు, మే 15 : విద్యార్థుల్లో చైతన్య దీపాలు వెలిగిస్తూ తన జీవితాన్ని జీతాన్ని విద్యార్థులకే వినియోగిస్తున్న పాలకొల్లు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుడిదే అని భావించి వారికోసం పరిశ్రమిస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరు తెచ్చున్నారు పాలకొల్లు వీవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న రాయపూడి భవానీ శంకర ప్రసాద్. పాలకొల్లు మున్సిపల్ టీచర్‌గా 2000 సంవత్సరం నుంచి పనిచేస్తున్నారు. తాను పనిచేసే పాఠశాల అభివృద్ధికి దాతల సహకారంతో విద్యార్థులకు విద్యాసామాగ్రిని సమకూర్చడమే కాకుండా పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్, మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషి చేశారు. 22వ వార్డులోని కొత్తపేట స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉన్న సమయంలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన భవానీ ప్రసాద్ పలు సేవా సంస్థలను, దాతలను ఆశ్రయించి, సుమారు రూ.7లక్షలతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తన సొంత ఖర్చుతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుంటారు. పాఠశాలలో 2వ తరగతి విద్యార్థికి గుండె ఆపరేషన్ కోసం దాతల సహకారంతో సుమారు రూ.53 వేలు సేకరించి అందించారు. దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామాగ్రిని అందించడంతో పాటు పాఠశాలకు డైలీ న్యూస్ పేపర్లు వచ్చే విధంగా చేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదవాలి అనేది ఆయన లక్ష్యం. ఆయన ఏ పాఠశాలకు వెళ్ళినా ఆ స్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. అందుకే ఆయన విద్యార్థులకు మా'స్టార్'గా నిలిచారు..




దాతల సాయంతో సమకూర్చిన ఆట వస్తువులు,విద్యాసామాగ్రితో విద్యార్థులు (ఫైల్)

క్రైం వార్తలు

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మే 15 : ఎన్నికలు జరిగిన సమయంలో సైకిల్‌పై చక్కెర్లు కొట్టాడని కక్ష పెంచుకుని కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో వారందరిపై కేసు నమోదు చేసిన టూటౌన్ సీఐ ప్రభాకర్ బుధవారం మధ్యాహ్నం వారిలో ముగ్గురిని అరెస్టు చేశారు.ఏలూరు కొత్తపేటకు చెందిన చీపుర్ల గణేష్ (25) పూలకొట్టులో పనిచేస్తూ ఉంటాడు. ఈనెల 13వ తేదీన ఎన్నికలు జరిగిన రోజున సైకిల్ వేసుకుని తిరిగాడు. 14వ తేదీ రాత్రి కొంతమంది అతని ఇంటికి వచ్చి గణేష్ ఉన్నాడా అని అడిగి వెళ్ళిపోయారు. రాత్రి తన స్నేహితులతో కలిసి కొత్తపేట ఏటిగట్టు ప్రాంతంలో టిఫిన్‌కు వెళ్తుండగా రాళ్ళతో గణేష్‌పై దాడి చేశారు. ఎవరు అని ప్రశ్నించేలోపు అదే ప్రాంతానికి చెందిన వీర లీలా కుమార్, బోగా అనిల్, బత్తుల సతీష్ మరికొంతమంది కలిసి అతనిపై దాడి చేసి మెడపై బలమైన వస్తువుతో కోశారు. గాయాలపాలైన బాధితుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వారిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారిని కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

డివైడర్ ఢీకొని ఒకరు మృతి



అన్నవరం (ఫైల్)

తణుకు, మే 15 : తణుకు బైపాసు బెల్లం మార్కెట్ సమీపంలోని ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన ఈతకోట అన్నవరం (41) బుధవారం ద్విచక్ర వాహనంపై తణుకు వస్తుండగా డివైడర్‌ను ఢీకొట్టి పడి పోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తాపీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్నవరం తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినమల్లంలో వివాహిత ఆత్మహత్య

పెనుగొండ, మే 15: పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో బీచ్‌కు తీసుకు వెళ్లలేదని మనస్థాపంతో ఒక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని తెలిపిన వివరాల ప్రకారం చోడగిరి మనీషా (29) చినమల్లం గ్రామంలో 11 నెలలుగా భర్తతో కలిసి ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. భర్త హరికృష్ణ బుధవారం పేరుపాలెం బీచ్‌కు తీసుకెళతానని భార్య, పిల్లలకు చెప్పాడు. భర్త ఇంటికి వచ్చేసరికి ఆలస్యం అయింది. వచ్చిన తరువాత బయలుదేరమని అడగగా భార్య రానని కోపంతో ఇంటి దగ్గరే ఉండిపోయింది. తన ఇద్దరు కుమార్తెలతో బీచ్‌కు వెళుతుండగా మార్గమధ్యలో ఫోన్ రావడంతో తిరిగి వచ్చాడు. భార్య ఉరి వేసుకుని చనిపోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు రూరల్ ఎస్ఐ



మృతుడు చుక్క బాలాజి (ఫైల్)

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి

కొవ్వూరు, మే 15 : గోదావరి నదిలో స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదీలో మునిగి విద్యార్థి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ తెలిపారు.పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజి (24) ఏఎస్‌ఆర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని విజ్జేశ్వరం బ్యారేజ్ 36వ గేట్ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. నది లోతును గమనించకుండా గోదావరిలో దిగడంతో ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వేసవిలో విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి నదీ స్నానాలకు దిగరాదని కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.సుధాకర్ హెచ్చరించారు. అఖండ గోదావరిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం బ్యారేజ్ ఆనకట్ట వద్ద గోదావరి నది ఎక్కువగా ఉందన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు గోదావరి నదిలో స్నానాలు చేయడానికి వచ్చి మృత్యువాత పడుతున్నారు. ఆనకట్ట వెంబడి స్నానాలు చేయడానికి ప్రమాదభరితంగా ఉన్నందున ప్రజలు, విద్యార్థులు, పర్యాటకులు వచ్చి నదిలో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

ఎన్నికల విధుల నుంచి వస్తుండగా ప్రమాదం

బైక్‌పై నుంచి పడి ఉపాధ్యాయుడికి గాయాలు

పాలకొల్లు అర్బన్, మే 15 : ఎన్నికల విధులు పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైనట్టు ఆలస్యంగా తెలిసింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, నరసాపురానికి చెందిన ఎం.మార్కండేయులు భీమవరంలో మూడు రోజులు ఎన్నికల విధులు పూర్తి చేసుకుని మంగళవారం నరసాపురానికి స్కూటీపై వస్తుండగా వీరవాసరం మురుగు కాలువ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపక్క చేలల్లో పడిపోయాడు. వెనుక వైపు నుంచి వస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు చూసి ఆయనను 108 వాహనంలో పాలకొల్లులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 36 గంటలకు పైగా డ్యూటీ చేసి రావడంవల్ల తీవ్ర అలసటకు గురై ఉండవచ్చని యూటీఎఫ్ నాయకులు తెలిపారు ప్రస్తుతం అతడు కోలుకుంటున్నట్టు యూటీఎఫ్ నాయకులు జి.లక్ష్మీనారాయణ, యు.పెద్దిరాజు తదితరులు తెలిపారు.

జన్యుపరమైన లోపంతోనే రక్త హీనత


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పోలవరం, మే 15: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియా రక్త నమూనాల సేకరణ జరిగింది. వింజరం, ఎల్లండీపేట పీహెచ్‌సీల పరిధిలో ఎల్లండీపేట, గూటాల, పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోటలలో రక్త నమూనాలు సేకరించారు. జన్యుపరమైన లోపం వల వచ్చే రక్త హీనత వలన రక్తంలో ఆక్సిజన్ కొరత ఏర్పడి రక్త నాళాల్లో రక్తం గడ్డ కడుతుందని దాని వలన ఎముకల నొప్పి ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు. మండలంలో సికిల్ సెల్ ఎనీమియా కేసులకు వైద్య సాయం అందించేందుకు రక్త నమూనాల సేకరిస్తున్నట్లు వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. వింజరం పీహెచ్‌సీ పరిధిలో 122, ఎల్లండీపేట వింజరం పరిధిలో ప్రగడపల్లి, చేగొండపల్లిలో 30 రక్త నమూనాలు సేకరించినట్లు ఆయా ఎంపీహెచ్ ఈఓలు సోమరాజు, జె.ప్రసాద్ తెలిపారు.

దోమల మందు పిచికారీ


కుంకాలలో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

పోలవరం, మే 15 : దోమల మందు పిచికారీతో మలేరియా నివారణ సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారి సురేష్ తెలిపారు. మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీ పరిధిలోని పాత కుంకాల, మనుగోపల గ్రామాలలో ఎంపీహెచ్ఏ బొంగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం తొలి విడత దోమల మందు పచికారీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి ఆయా గ్రామాలలో దోమల మందు పిచికారీపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, పనులను పర్యవేక్షించారు. కుంకాల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎల్లండీపేట వైద్యాధికారి నిఖిల్, వైద్య సిబ్బంది శ్రీను, రామరాజు జె.ప్రసాద్, ఏఎన్ఎంలు, హెచ్‌వీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీపీఐ ఎంపీ సెల్వరాజ్ మృతికి సంతాపం

టి.నరసాపురం, మే 15: భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు తమిళాడులోని నాగపట్నం ఎంపీ సెల్వరాజ్ మృతికి ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టీవీఎస్ రాజు ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికైనా సెల్వరాజ్ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మూత్రపిండాల వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. సెల్వరాజ్ మృతికి మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ, సుబ్బారావు, సతీష్, ఏఆర్ పాలెం భూపోరాట సమితి నాయకులు గదుల సత్యనారాయణ, శెట్టి నాగ బాలాజీ పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు సెల్వరాజ్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తి వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు రూరల్, మే 15: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో ఒక పత్రికలో వచ్చిన వార్తను సాకుగా చూపి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే నెపంతో ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేయటం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో పాల్గొనడం, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పరిధిలోకి రాదన్నారు. అయినా యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు ఓట్లు వేయమని ప్రేరేపించటం, రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేయటం, తదితర అంశాలు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పరిధిలోకి వస్తాయన్నారు. కాని అటువంటి అభియోగాలు ఏమీ లేకుండా సుందరయ్యను అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి తక్షణం విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కావూరి లావణ్య పై పీసీసీకి ఫిర్యాదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థులు

ఏలూరు రూరల్, మే 15: ఇండియా కూటమి అభ్యర్థులపై అసత్య ఆరోపణలు చేసిన ఇండియా కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య పై పీసీసీ ఫిర్యాదు చేస్తామని ఏలూరు జిల్లా బీసీసీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఆయా నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థులు తనను అవమానించారని, ప్రచారానికి డబ్బులు డిమాండ్ చేశారన్న లావణ్య వాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. అభ్యర్థుల నియోజకవర్గాల పర్యటన ముందుగా తెలియజేయకుండా ఆమె ఒంటెద్దు పోకడలు పోయిందన్నారు. డబ్బులు డిమాండ్ చేశారనేది వాస్తవం కాదన్నారు. చింతలపూడి, దెందులూరు, ఉంగుటూరు, నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థులు ఎలీజ, ఆలపాటి నరసింహమూర్తి, పి.హరికుమార్ రాజు, మరీదు కృష్ణ మాట్లాడుతూ తాము డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. లావణ్య వెనుక కొంతమంది వ్యక్తులు ఉన్నారని, వారే ఈ ఆరోపణలు చేయిస్తున్నారని ఆరోపించారు. కావూరి లావణ్య పై క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు. నాయకులు శరత్‌చంద్ర, దారం యోహానురాజు, సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న పాలక వర్గాల పనితీరు


పుంత రోడ్డు దుస్థితి(ఫైల్ ఫోటో)

ఉంగుటూరు,మే 15 : రైతుల పంటల ఒబ్బిడి కోసం ముఖ్య భూమికగా ఉండే మార్కెట్ కమిటీలు జగన్ ప్రభుత్వంలో నిర్వీర్యమయ్యాయి. దీంతో మార్కెట్ కమిటీల పాలక వర్గాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. తెలుగు దేశం హయాంలో కళకళ లాడిన మార్కెట్ కమిటీలు ఎంతో కొంత పుంత రోడ్లను వేయించారు అయితే వైసీపీ ప్రభుత్వంలో వాటి ఊసే లేకుండా పోయి ంది. ధాన్యం ఆరబెట్టుకోవడానికి కళ్లాలు లేకపోవడం సార్వా సీజన్‌లో వర్షాల సమ యంలో ధాన్యం బయటకు వెళ్లడానికి రైతులు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు. అయితే పాలక వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నదాతలకు సేవలం దించడంలో విఫలమైంది. ఇందులో భాగంగా గతంలో పాలకవర్గాల ద్వారా ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించగా ఇప్పటి ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు. ఉంగుటూరు మార్కెట్ కమిటీకి స్థలం ఉన్నా భవన నిర్మాణం, ప్రహరీ నిర్మాణం జరగలేదు. వీటికి నిధులు మంజూరైనా ఐదేళ్ల పాలనలో ఏడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా పుంత రోడ్లకు మోక్షం కలగ లేదు. పాలక వర్గ సమయం ముగిసి 21 నెలలు దాటినా నూతన పాలకవర్గం వేయలేదు. ఈ కమిటీ ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో 68 గ్రామాలు ఉండగా చేబ్రోలు, నారాయణపురం, వరదరాజ పురం, సరిపల్లిల వద్ద చెక్ పోస్టులు ద్వారా ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. చేబ్రోలులోని అద్దె కార్యాలయంలో కమిటీ భవనం నెలకు రూ.7,500లతో కాలం గడుపుతోంది.

ఆగని వైసీపీ ఆగడాలు

- బాధిత కుటుంబాలకు పరామర్శలు
- మేమున్నామంటు నేతల భరోసా


బాధిత బంధువులతో మాట్లాడుతున్న చంటి

ఏలూరు టూ టౌన్, మే 15: ఎన్నికలు పూర్తయ్యి రెండు రోజులు గడుస్తున్న ఇంకా వైసీపీ కార్యకర్తల ఆగడాలు ఆగటంలేదు. ఈ నెల 13వ తేదీ ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి కార్యకర్త వేమూరి నాగరాజు పై దాడికి పాల్పడి మెడ పై కత్తితో కోసిన సంఘటన మరువకముందే ఈ నెల 14వ తేదీ టీడీపీ కార్యకర్త 40వ డివిజన్‌కు చెందిన గణేష్ పై వైసీపీ కార్యకర్తలు మరోసారి దాడులకు దిగారు. గాయాలపాలైన గణేష్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం గణేష్‌ను పరామర్శించిన అనంతరం చంటి మాట్లాడుతూ ప్రశాంతతకు మారు పేరైన ఏలూరులో వైసీపీ నేతలు భౌతికదాడులకు దిగటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. గణేష్‌కు అందుతున్న వైద్యసేవల పై ఆరా తీశారు. కూటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. త్వరలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ఆ వెంటనే విర్రగుతున్న వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలను కాపాడాలంటూ పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, బాలాజీ, బెల్లంకొండ కిషోర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : చింతమనేని

పెదవేగి : ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో బుధవారం తనను కలిసిన కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ మీ అందరి కృషి, పట్టుదలతో విజయం దిశగా అడుగేశామన్నారు. ఐదేళ్ల రాష్ట్రంలో అరాచక పాలన సాగిందన్నారు. అవినీతి, అక్రమాలు, మట్టి మాఫియా, ఇసుక దోపిడీకి అడూ అదుపు లేకుండా పోయిందని ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యకాండకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇకపై ఇటువంటి దాడులు, దౌర్జన్యాలకు చరమ గీతం పాడిస్తామని, దెందులూరులో తిరిగి ప్రశాంత వాతావరణాన్ని తీసుకొస్తానని ఆయన చెప్పారు. మరో 20 రోజుల్లో ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, ఆపై రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ మూకల దాడులను అరికట్టాలి

లింగపాలెం, మే 15: తెలుగుదేశం నేతలు, కార్యకర్తల పై వైసీపీ మూకల దాడులను ఆపాలని, లేదంటే కొన్ని రోజుల్లోనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, టీడీపీ నేత రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుంటే వైసీపీ నాయకులు ఇటువంటి దుశ్చర్యలకు దిగటం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను ఎన్నికల అధికారులు, పోలీసులు అరికట్టాలని లేదంటే రాష్ట్రం మరో బీహార్‌లా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇటువంటి దాడులు చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓడిపోతామని అక్కసుతోనే దాడులు

చింతలపూడి : అధికార పార్టీ ఓడిపోతుందన్న అక్కసుతో రాష్ట్రంలో పలుచోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ శ్యామ్‌చంద్రశేష అన్నారు. జంగారెడ్డిగూడెం పార్టీ క్యాంప్ కార్యాలయంలో సాయిల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ కూటమి భారీ విజయాన్ని అందుకోబోతోందని తెలిపారు.

ఎన్నికలకు ఒక్కరోజు ముందు సీఎస్ 14,465 కోట్ల పథకాల నిమిత్తం డబ్బులు వేయాలని, తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రభుత్వానికి సహాయం చేయాలని ప్రయత్నించారన్నారు. వాని ఎత్తుగడలు సాగలేదన్నారు. ఎన్నికల అయిన తరువాత ఎప్పుడైనా ప్రజల ఖాతాలో డబ్బులు జమ చేయవచ్చని చెప్పినా, నేటివరకు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఆ డబ్బులను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో లేని విధంగా అత్యధిక పోలింగ్ నమోదు అయిందని ఈ పరిణామం ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ గెలుపునకు నాంది అని పేర్కొన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎన్నికల్లో పని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరి, రైతు అధ్యక్షుడు ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.


దుగ్గిరాలలో కార్యకర్తలతో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్


చింతలపూడిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చంద్రశేషు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

చింతలపూడి, మే 15: ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇప్పుడు గెలుపు పై ఎక్కడ చూసినా ఎవరి లెక్కలు వారివే, ఎవరి ధీమా వారిదే. గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా ఇవే చర్చలు. దూరాన ఉన్నవారు కూడా ఎలా ఉంది? ఎవరు గెలుస్తారని అనుకుంటున్నారంటూ ఆరా తీస్తున్నారు. దూరప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు యువకులు, కుటుంబాలతో తరలివచ్చారు. వెంటనే తిరుగు ప్రయాణం పట్టారు. ఓటు విలువ తెలుసుకుని వచ్చారా? కావాలని కసితో వచ్చారా? అనేది ఫలితాలు వస్తేనే గాని తెలియదు. నియోజకవర్గంలో అభివృద్ధి అనేది ఎక్కడ కానరాదు. ఏ ఒక్కరోడ్డు బాగోలేదు. ఐదేళ్ళ ప్రజలు నరకం చూశారు. ఇక మార్పు తప్పదనే నిర్ణయానికి వచ్చారు. మరో ఐదేళ్ల రాష్ట్రం నష్టపోకుండా ఉండాలంటే ఓటు వేయటం ఇదే మార్పుకు నిదర్శనమని, ముఖ్యంగా యువకులు తరలిరావడం పై చర్చించుకుంటున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు క్యూలో నిలబడి ఓటు వేశారు. ఈవీఎంలు మొరాయింపు కూడా ఓటు వేసేటప్పుడు గట్టిగా, కసిగా నొక్కటమేనని దీనివల్ల పలుచోట్ల పలుమార్లు ఈవీఎంలు ఎర్రర్ చూపటం, వాటిని సరి చేసుకోవడం, తిరిగి పోలింగ్ చేయటం వల్ల అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. డబ్బు, మందు ప్రభావం కంటే రాష్ట్రాభివృద్ధి మీదే యువకులు దృష్టిపెట్టారని తెలుస్తోంది. అయితే పందేలకు సై అంటే మాత్రం ససేమిరా అంటున్నారు పందెం రాయుళ్లు. నియోజకవర్గంలో చెప్పాలంటే కూటమి తరపున విజయం తథ్యమని, 15 శాతం మారితే చాలు విజయం మనదేనని మెజార్టీపైనే చర్చలు జరుగుతున్నాయి. నాలుగు మండలాల్లోనూ బూత్‌లవారీగా ఏ విధంగా పోల్ అయింది? ఎలా వేశారు? ఎంత మెజార్టీ వస్తుంది? అనే దారిపైనే చర్చలు సాగుతున్నాయి.

అంతుచిక్కని ఓటరు మనోగతం

బుట్టాయగూడెం, మే 15: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరు మనోగతం తెలియక ఆయా పార్టీల నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ తామే గెలవబోతు న్నామని చెబుతున్నా లో లోపల ఫలితాలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రధాన పార్టీల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా మారడంతో ఫలితాలపై ఉత్కంఠ పెరిగిపోతోంది. ఓటు ఎవరికి వేశారో తెలుసుకో డానికి పలకరిస్తే సిక్రెట్ అంటూ ఓటరు తెలివిగా చెప్పడం తో ఆయా పార్టీల శ్రేణులు గెలుపుపై అంచనాకు రాలేకపోతున్నారు. మండల వ్యాప్తంగా 55,134 జనాభా ఉంటే 43,027 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 20,170, మహిళలు 22,853 మంది ఉన్నారు. ఓటు వేయడానికి వీరంతా పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రావడంతో వారంతా తమకే ఓటు వేశారంటు ఇరు పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలవరం నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలతోపాటు ఇతరులు కూడా పోటీ చేస్తున్నారు. వీరిలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీకి అటవీ ప్రాంతంలో కాస్తాంత ఓటు బ్యాంకు ఉంది. దీనితోపాటు మొడియం సూర్యచంద్రరావు ఎవరి కొంప ముంచుతాడోనంటూ ఆయా పార్టీల నాయకులు లోలోపల ఆందోళన చెందుతున్నారు. అయితే ఫలితాల కోసం మరికొన్ని ఆగాల్సిందేనని సరిపుచ్చుకుంటున్నారు.

82.16 శాతం పోలింగ్

బుట్టాయగూడెం మండలంలో 82.16 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తంగా 43,027 మంది ఓటర్లు ఉండగా 35,350 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.

సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయం


కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ శాఖ ఉద్యోగులు

ఏలూరు రూరల్, మే 15: ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో గోదావరి జిల్లాలకు అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ జయంతిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన గొప్ప దార్శనీకుడు కాటన్ అని కొనియాడారు. ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవప్రకాష్, ఇంజినీర్లు కె.రాజు, బాబురావు, అర్జున్, బొట్టా శ్రీనివాస్, ప్రిస్సిల్లా, పి.కిషోర్, నిఖిలేష్, రిటైర్డ్ ఇంజినీర్ ఎం.కృష్ణారావు, ఎన్.శ్రీనివాస్, మధుసూదన్, వెంకటపతిరాజు, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం : కాటన్ మహాశయుడు తన జీవి తాన్నంతా భారతదేశంలో నీటిపారుదల, నావికా యోగ్యమైన కాలువలు కట్టించడానికి ధారపోశాడని మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణం రాజు కొనియాడారు. కాటన్ జయంతి పిప్పర టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా చేయడంలో టీడీపీ ప్రభుత్వం ఎంతో శ్రమించిందన్నారు. రానున్న కాలంలో కాటన్ మహాశయుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కూసం పూడి సురేంద్ర కుమార్‌రాజు, కాపారం చిన్న, ఇందుకూరి మారిరాజు, సీడెల్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి ఏసుబాబు, కొలనువాడ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు రూ.50 లక్షల స్కాలర్ షిప్


పోస్టర్లను విడుదల చేస్తున్న డీన్ డాక్టరు సుబ్రహ్మణ్యశర్మ తదతరులు

పెదపాడు, మే 15 : ఈ ఏడాది నుంచి ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించి తద్వారా నూతన ఆవిష్కరణలకు వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా ఘంటా రామచంద్రరావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 లక్షల స్కాలర్ షిప్‌లను అందజేస్తున్నట్లుగా రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. స్కాలర్ షిప్‌లకు సంబంధించి పోస్టర్‌ను డీన్ డాక్టరు సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. డీన్ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఏపీఈఏపీ సెట్ 2024లో ఉత్తమ ర్యాంకులు సాధించిన కళాశాలకు చెందిన విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు స్కాలర్ షిప్ రూపేణా అందజేస్తున్నామన్నారు. అలాగే నాణ్యమైన విద్యతో పాటు గుర్తింపు పొందిన సంస్థల్లో ఉద్యోగాల కల్పన దిశగా ప్రత్యేకమైన ప్లేస్‌మెంట్ సెల్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ డాక్టరు చిరంజీవి, ఇంటర్నల్ ఎఫైర్ డీన్ డాక్టరు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా రెడ్‌క్రాస్


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వీణ అక్కినేని

ఏలూరు క్రైం, మే 15 : తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ, విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై బధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏటా పది వేల మంది తలసేమియా వ్యాధితో జన్మిస్తున్నారని అలాంటి వారు జీవితాంతం నిరంతర రక్తమార్పిడి మందులను వాడాల్సిందేనని అన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పీడి యాట్రిక్ హెమటో అంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగడానికి ముఖ్య కారణం ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమేనని పేర్కొన్నారు. ఆరు నెలల నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలు రక్తహీనతతో బాధపడు తున్నట్లు అయితే వెంటనే వైద్యుల సలహాతో తలసేమియా, హిమోఫీలియా వంటి పరీక్షలు చేయించాలన్నారు. తలసేమియా వ్యాధి పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ పరిష్కారం ఉన్నప్పటికీ మ్యాచింగ్ దాత దొరకాలని ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని అన్నారు. అయినప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం సహకారం అందిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. సదస్సుకు హాజరైన 150 మందికి మానవతా విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ జేవీ ప్రసాదరెడ్డి, డాక్టర్ స్పందన, ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు, మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఆలపాటి వెంకటలక్ష్మి, ప్రసన్న, లావేటి శ్రీను, పీఆర్వో కేవీ రమణ, విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పెదలంకలో కిక్కిస గుట్ట దగ్ధం



కలిదిండి, మే 15 : పెదలంకలో బుధవారం సాయంత్రం ఉప్పుటేరు వద్ద ప్రమాదవశాత్తు కిక్కిస గుట్ట దగ్ధమవ్వడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. మోటారు పంపు సెట్‌లతో మంటలను అదుపు చేయటానికి ప్రయత్నించినప్పటికీ మంటలు ఎగసి పడడంతో కైకలూరు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా, ఫైరింజన్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను అదు పు చేశారు. కిక్కిస గుట్టకు కూత వేటు దూరంలో పూరిళ్లు ఉన్నాయి. కిక్కిస మంటలు పూరిళ్ల వైపునకు వస్తే గ్రామంలో భారీ నష్టం వాటిల్లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఉప్పుటేరు పక్కన ఉన్న డ్రైనేజీ నీటిని మోటార్ పంపు సెట్ల సహాయంతో మంటలను కొంత వరకు అదుపు చేయడంతో ప్రమాదం తప్పిం ది. సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

యువ ఓటర్లలో చైతన్యం

ఉంగుటూరు,మే 15: యువ ఓటర్లలో చైతన్యం పెరిగింది. ప్రధానంగా నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ ఊసే లేక పోవడం ఎన్నికల ముందు స్పష్టంగా కొద్ది పాటి పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో వారిలో కసి పెరిగి జనసేన వైపు మొగ్గుచూపడం విశేషం. పోలింగ్ బూత్‌లలో కూడా జనసేన కార్యకర్తలు యువకులను కూర్చోబెట్టడంతో వైసీపీ శ్రేణులలో అలజడి సృష్టించింది. పైగా మధ్యాహ్న సమయానికి వైసీపీ శ్రేణులలో నిరుత్సాహం చోటు చేసుకోవడం గమనార్హం.

పుంతలముసలమ్మ సన్నిధిలో కూటమి నాయకులు


అమ్మవారిని దర్శించుకుంటున్న జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

గణపవరం, మే 15: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరుణంలో అమ్మవారిని దర్శించేందుకు భక్తులు ఆలయాలకు పోటెత్తుతున్నారు. గణపవరం మండలం మొయ్యేరులో ఉన్న పుంతల ముసలమ్మ అమ్మవారిని బుధవారం తాడేపల్లిగూడెం జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జీ, బీజేపీ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధం సతీష్, కానుమిల్లి వెంకటేశ్వరరావు (చంటి), ఇంటూరి చంద్ర మోహన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమిదే అధికారం



కొయ్యలగూడెం, మే 15: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పారేపల్లి రామారావు, రాష్ట్ర టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘలాదేవి అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నేట్టేసిందని విమర్శించారు. దీంతో ప్రజలు మేల్కొని పోలింగ్‌లో తమ సత్తా చూపారన్నారు. ఏలూరు ఎంపీ స్థానాన్ని, పోలవరం ఎమ్మెల్యే స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, చోడిపిండి సుబ్రహ్మణ్యం, జ్యేష్ట రామకృష్ణ, గొమ్మా బాబు, బెల్లాని శ్రీను, ఏపూరి సతీష్, చినరాజు, తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు

నూజివీడు, మే 15: నూజివీడు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తరలించారు. నూజివీడు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్‌లను దాఖలు చేయగా, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లను జిల్లాల వారీగా విభజించి వివిధ రాజకీయ పక్షాల నాయకుల సమక్షంలో ఆయా జిల్లాల స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. నూజివీడు ఆర్వో ఆర్డీవో వై.భవానీశంకరి పర్యవేక్షించారు.

క్రైం వార్తలు

చోరీ కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 15 : ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పరిధిలోని మంచెం అప్పారావునగర్‌లో నివాసముంటున్న మంచెం జగన్నాధరావు ఆక్వా ఫీడ్ సరఫరా చేస్తూ ఉంటారు. ఆయన కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి టీవీ, రూ.12 వేల నగదు అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నిరుపయోగంగా అన్న క్యాంటీన్ భవనం

అన్న క్యాంటీన్‌కు పూర్వ వైభవం వచ్చేనా?

నూజివీడు టౌన్, మే 15: ఓ ప్రభుత్వ పథకం మరో ప్రభుత్వం వ్యర్థంగా భావించింది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అన్న క్యాంటీన్‌లు. గత ప్రభు త్వం పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లల్లో అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసింది. నూజివీడు ఆర్.ఆర్.పేటలో ప్రధాన రహదారి పక్కన దాదాపు రూ.25 లక్షల వ్యయంతో నిర్మితమైన అన్న క్యాంటీన్ దాదాపు ఆరునెలల పాటు అన్నార్తులకు రూ.5లకు భోజనం, అల్పాహారాన్ని అందించింది. ఇక్కడ ప్రతి రోజూ దాదాపు 2 వేల మందికి పైగా భోజనాలు చేసేవారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ అన్నక్యాంటీన్‌లను పక్కన పెట్టేయడంతో ఇదిగో ఇలా పాడుపడిన బంగళాలా దర్శనమిస్తోంది. ప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలతో అన్న క్యాంటీన్ పేరు ఊడిపోయి వేలాడుతూ చూపరులకు సైతం ఆవేదన కలిగించేలా భవనం దర్శనమిస్తోంది. అయితే తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వం మారుతుందనే అభిప్రాయం వినిపిస్తుండటంతో అన్న క్యాంటీన్‌కు పూర్వవైభవం వస్తుందని, పేదలకు, కూలీలకు అతి తక్కువకే భోజనం లభిస్తుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.


ముదినేపల్లి గ్రంథాలయం వద్ద అపరిశుభ్రత

చదువుకునేదెలా..?

గ్రంథాలయం చుట్టూ అపారిశుధ్యమే

ముదినేపల్లి, మే 15 : ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయం పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. గ్రంథాలయం వెంబడి నిర్మించిన పక్కా డ్రైన్‌లో నీరు కదలకపోవటమే కాక చుట్టు పక్కల ఇళ్లలోని చెత్తను కూడా అక్కడే వేస్తున్నారు. దీంతో గ్రంథాలయంలోకి దుర్వాసన వెదజల్లడంతో పాఠకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. డ్రైన్‌లో నిల్వ ఉన్న మురుగు నీరు పొంగి రోడ్డు మీదకు వస్తోంది. పంచాయతీ అధికారులు గ్రంథాలయం వద్ద పరిశుభ్రతను కాపాడాలని చెత్త నిల్వలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఇందిరా కాలనీ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఎట్నుంచి ఏ వాహనం వస్తుందో..?

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

కలిదిండి, మే 15 : మండలంలో పలు రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కలిదిండిలో ఇందిరా కాలనీ వద్ద రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు సంభవించి పదుల సంఖ్యలో వాహనదారులు, ద్విచక్ర వాహన చోదకులు మృతి చెందారు. ఈ మలుపు వద్ద అక్రమ కట్టడాలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్వానిగూడెం వద్ద మలుపులో ఆక్రమణల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు వాహనదారులు, ద్విచక్ర వాహన చోదకులు క్షతగాత్రులయ్యారు. ఈ మలుపు వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అక్రమ కట్టడాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

ముదినేపల్లి, మే 15 : ఎన్నికల విధుల్లో రెండు నెలలుగా నిమగ్నమైన అధికారులు పోలింగ్ ముగియటంతో ఊపిరి పీల్చుకున్నారు. మార్చి 16 నుంచి ఇప్పటి వరకు కోడ్ అమలు, చెక్ పోస్టుల నిర్వహణ, వాహనాల తనిఖీలతో పాటు తమ శాఖలకు సంబంధించిన విధులతో టెన్షన్‌ను ఎదుర్కొన్న వివిధ శాఖల అధికారులకు భారం తగ్గిపోయింది. ఎన్నికల సంఘం నుంచి ఏ సమయంలో ఎటువంటి ఆదేశాలు వస్తాయో, ప్రజల నుంచి వివిధ యాప్‌ల ద్వారా ఏ విధమైన ఫిర్యాదులు అందుతాయోనన్న ఉత్కంఠతో మండల స్థాయి అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు టెన్షన్‌లోనే ఉండేవారు. పని ఒత్తిడితో కొంతమంది అధికారులు అనారోగ్యాలకు గురయ్యారు. ముదినేపల్లి మండలంలో చెక్ పోస్టు వద్ద సరిపడినంత సిబ్బంది లేక ఇన్‌చార్జ్ అధికారులే తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బెల్టుషాపులను గుర్తించటం, రాత్రింబవళ్లు వాహనాలు తనిఖీ ఇబ్బందిగా మారింది. ఇక కాల్వలకు నీరు విడుదల చేయటం, మంచినీటి చెరువులను నింపే పనులను పర్యవేక్షించటం లాంటి పనులను కూడా నిర్వహించటం అధికారులకు తలకు మించిన భారమైంది. ఎన్నికలు ముగియటంతో వారికి ఉపశమనం కలిగింది. అయితే విశ్రాంతి అవసరమైన వారికి సెలవులు పెట్టుకునే అవకాశం లేకుండాపోయింది.



పెదలంకలో దగ్ధమవుతున్న కిక్కిస గుట్ట

పెదలంకలో కిక్కిస గుట్ట దగ్ధం

కలిదిండి, మే 15 : పెదలంకలో బుధవారం సాయంత్రం ఉప్పుటేరు వద్ద ప్రమాదవశాత్తు కిక్కిస గుట్ట దగ్ధమవ్వటంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. దీంతో గ్రామస్థులు ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. మోటారు పంపు సెట్‌లతో మంటలను అదుపు చేయటానికి ప్రయత్నించినప్పటికీ మంటలు ఎగసి పడటంతో కైకలూరు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా, ఫైరింజన్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. కిక్కిస గుట్టకు కూత వేటు దూరంలో పూరిళ్లు ఉన్నాయి. కిక్కిస మంటలు పూరిళ్ల వైపుకు వస్తే గ్రామంలో భారీ నష్టం వాటిల్లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామస్థులు ఐక్యంగా ఉప్పుటేరు పక్కన ఉన్న డ్రైనేజీ నీటిని మోటార్ పంపు సెట్ల సహాయంతో మంటలను కొంత వరకు అదుపు చేయటంతో ప్రమాదం తప్పింది. సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

గెలుపెవరిదో..?

- ఓటింగ్ సరళిపై ఆరా
- అంచనాల్లో అభ్యర్థులు..
- ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ
- పలు చోట్ల బెట్టింగ్‌లు



అన్నా.. నియోజకవర్గ పరిస్థితి ఏమిటి.. ఎవరు గెలుస్తారు... ఏ మండలంలో ఎవరికి మెజార్టీ వస్తుంది.. పోలింగ్ శాతం ఎవరికి మేలు చేస్తుంది? రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది? సర్వత్రా ఇవే చర్చలు, అంతటా ఇదే ఉత్కంఠ. ఎవరు ఫోన్ చేసినా... ఎక్కడ ఇద్దరు కలిసినా.. ఇవే చర్చోపచర్చలు.

కైకలూరు, మే 15: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ప్రజల్లో ఎవరు గెలుస్తారన్న చర్చలు తీవ్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. రెండు రోజులుగా ఎక్కడ చూసినా గెలుపోటములపై ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు అభ్యర్థులు ఏయే గ్రామాల్లో, ఏయే పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓటు వచ్చాయి, ఎక్కడ మెజార్టీ ఉంది.. ఎక్కడ తక్కువగా వస్తుందని అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితాలపై ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతుంది. నియోజకవర్గంలో కూటమి, వైసీపీ నాయకులు బూత్‌ల వారీగా పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు.

పందేల జోరు...

మా అభ్యర్థి 20 వేలు మెజార్టీతో గెలుస్తారని నాది లక్ష పందెం.. అబ్బే మీ అభ్యర్థి ఓడిపోతారు నాది లక్ష పందెం.. కాదు కాదు స్వల్ప మెజార్టీతో అయినా మా అభ్య ర్థి బయటపడతారని మూడు వంతుల బెట్ అంటూ కైకలూరు నియోజకవర్గంలో రాజకీయ బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీల గెలుపుపై భారీగా పందేలకు దిగారు. జూన్ 4న ఫలితాలు బహిర్గతం కానున్న తరుణంలో ఈ పందేలు నిర్వహిస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు ఎవరు గెలుస్తారన్న అంశం ఆసక్తిగా మారింది. దీంతో అభిమానులు లక్షల్లో పందేలు కాస్తున్నారు. గెలుపోటములతో పాటు మెజార్టీపైన అత్యధికంగా పందెంరాయుళ్ళు లక్షల్లో పందేలు కాస్తున్నారు. మరో వైపు కామినేని గెలుపుపై పెచ్చు పందేలు ఎక్కువగా కాస్తున్నారు. ఎవరు గెలుస్తారో అనే విషయమై పందేలు కాసేవారిలో ఎక్కువ ఉత్కంఠ నెలకొంది.

లెక్కలు.. సమీక్షలు

ముదినేపల్లి: పోలింగ్ ముగిసింది. ఓటింగ్ శాతం పెరిగింది. ఇది ఏ పార్టీకి లాభం? ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది? ఏ అభ్యర్థిని విజయం వర్తిస్తుంది? ఎక్కడ చూసినా ఇవే చర్చలు. అభ్యర్థులతో నాయకులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా పార్టీ కార్యక్రమాలు, ప్రచారాల్లో పాల్గొని గెలుపు కోసం ఎత్తుకు పై ఎత్తులు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు ఇప్పుడు మెజారిటీ లెక్కల్లో తలమునకలయ్యారు. కైకలూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై ముదినేపల్లి మండలంలో ఎడతెగని చర్చలు జరుగుతున్నాయి. మండలంలో గతంలో ఏనాడు లేని విధంగా 90 శాతం పోలింగ్ జరగటంతో ఇది ఏ పార్టీకి లాభం కలిగిస్తుందన్న ఉత్కంఠలో నాయకులు ఉన్నారు. గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ జరిగిన తీరు, ఏజెంట్ల అభిప్రాయాలను కూటమి, వైసీపీ నాయకులు తెలుసుకుని మెజారిటీలపై లెక్కలు వేస్తున్నారు. ముదినేపల్లి, పెయ్యేరు, పేరూరు, వైవాక, గురజ, పెదపాలపర్రు, చిగురుకోట, వడాలి, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, కొరగుంటపాలెం, శ్రీహరిపురం, కోడూరు, ఊటుకూరు, వణుదుర్రు, ప్రొద్దువాక లాంటి పెద్ద గ్రామాల్లో పెరిగిన ఓటింగ్ శాతంపై ప్రధానంగా రెండు పార్టీల నాయకులు మెజార్టీపై అంచనాల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గ ఫలితంపై ముదినేపల్లి మండలంలో వచ్చే మెజార్టీ ప్రభావం చూపిస్తుందని రాజకీయ వర్గాల అంచనా. దీంతో అభ్యర్థులతోపాటు, సీనియర్ నాయకులు కూడా మండలంలోని తమ పార్టీ నాయకుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.

కలిదిండిలో క్రాస్ ఓటింగ్?

కలిదిండి: కలిదిండిలో ఓటర్లు క్రాస్ ఓటింగ్ చేసినట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఓటర్లు అసెంబ్లీ అభ్యర్థికి కమలం గుర్తుపై, పార్లమెంట్ అభ్యర్థికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసినట్టు నాయకులు చర్చించుకుంటున్నారు. కలిదిండిలో మొత్తం 7,200 మంది ఓటర్లకు గాను 6100 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాపు, యాదవ, ముస్లిం సామాజిక వర్గాల ఓట్లు అధికంగా ఉన్నాయి. ఈ సామాజిక వర్గాల్లో క్రాస్ ఓటింగ్ చేశారని సమాచారం. కలిదిండితోపాటు పలు గ్రామాల్లో క్రాస్ ఓటింగ్ చేసినట్లు సమాచారం. ఈ క్రాస్ ఓటింగ్ వల్ల ఎవరు గెలిచినా 5 వేల నుంచి 10 వేల లోపు మెజార్టీతోనే గెలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.


కామినేనికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కైకలూరు సర్పంచ్ తదితరులు

ప్రజలకు రుణపడి ఉంటా : కామినేని

కైకలూరు, మే 15: కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను కలిసేందుకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు వరాహపట్నంలోని ఆయన నివాసానికి తరలివచ్చి పెద్ద ఎత్తున తరలివచ్చి అభినందనలు తెలుపుతున్నారు. గ్రామాల వారీగా వచ్చిన నాయకులను కామినేని ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. ఏయే గ్రామాల్లో మెజార్టీ వస్తుందన్న అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోనికి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనతో పాటు నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి కష్టపడి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరులో కూటమి నాయకుల సహకారంతో తన గెలుపు తథ్యమని, ఇక్కడి ప్రజలకు తాను రుణపడి ఉంటానని అన్నారు.

చాట్రాయి మండలంలో బూత్‌ల వారీగా

పోలింగ్ శాతం ఇదీ..

చాట్రాయి, మే 15: చాట్రాయి మండలంలో బూత్‌లవారీగా పోలింగ్ శాతం వివరాలను తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ బుధవారం విడుదల చేశారు. కృష్ణారావుపాలెంలో నం:1 బూత్‌లో 93.56 శాతం, చనుబండ పరిధిలో నం:2లో 82.63, నం:3లో 90.07, 4లో 90.38, సూరంపాలెం నం:5లో 84.17, 6లో 86.9, సి. గుడిపాడులో నం:7లో 89.20, 8లో 92.10, 9లో 87.03, 10లో 94.95, పర్వతాపురం నం:11లో 96.07, చిన్నంపేట నం:12లో 90.12, 13లో 90.03, 14లో 88.65, కోటపాడులో నం:15లో 91.03, 16లో 93.49, 17లో 91.68 శాతం ఓట్లు పోలయ్యాయని అన్నారు. చీపురుగూడెంలో నం. 18లో 93.95, 19లో 93.19, మంకొల్లులో నం:20లో 87.24, పోతనపల్లిలో నం:21లో 89.24, నం:22లో 88.98, బూరుగ్గూడెంలో నం:23లో 86.88, నం:24లో 91.96, చాట్రాయిలో నం:25లో 72.45, నం:26లో 81.65, నం:27లో 84.94, నం:28లో 86.13, పోలవరం నం.29లో 89.64, నం.30లో 86.16, నం.31లో 90.57, నం:32లో 87.88, ఆరుగొలనుపేటలో నం:33లో 96.01, 34లో 95.26 శాతం ఓట్లు పోలయ్యాయి. జనార్ధనవరంలో నం:35లో 90.47, 36లో 91.93, తుమ్మగూడెంలో 37లో 91.26, 38లో 86.77, 39లో 94.59, టి. గుడిపాడు నం:40లో 90.51, చిత్తపూరులో నం:41లో 88.54, 42లో 91.28, 43లో 94.54, సోమవరం నం:44లో 91.84, 45లో 90.46, మర్లపాలెం నం:46లో 86.28, నం:47లో 92.39, 48లో 94.26, 49లో 96.30, కొత్తగూడెం నం. 50లో 95.51, నం. 51లో 94.27 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం ఓటర్లు 43,322 మంది ఉండగా, ఇందులో పురుషులు 21,667 మంది, స్త్రీలు 21,654 మంది, థర్డ్ జండర్ ఒకరు ఉన్నారని, వీరిలో 38,977 మంది, 89.97 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించటానికి సహకరించిన ప్రజలకు, రాజకీయ పార్టీలకు, అధికార యంత్రాంగానికి తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు.

తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ అండ


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వీణ అక్కినేని

ఏలూరు క్రైం, మే 15 : తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని సొసైటీ జిల్లా ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ, విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏటా పది వేల మంది తలసేమియా వ్యాధితో జన్మిస్తున్నారని అలాంటి వారు జీవితాంతం నిరంతర రక్తమార్పిడి మందుల ను వాడాల్సిందేనని అన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పీడియాట్రిక్ హెమటో అంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగడానికి ముఖ్య కారణం ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమేనని పేర్కొన్నారు. ఆరు నెలల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతుంటే వెంటనే వైద్యుల సలహాతో తలసేమియా, హిమోఫీలియా వంటి పరీక్షలు చేయించాలన్నారు. తలసేమియా చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. సదస్సుకు హాజరైన 150 మందికి మానవతా విద్యానిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ జేవీ ప్రసాదరెడ్డి, డాక్టర్ స్పందన, ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస రావు, మానవత విద్యానిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు, ఆలపాటి వెంకటలక్ష్మి, ప్రసన్న, లావేటి శ్రీను, పీఆర్వో కేవీ రమణ, విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.


చాట్రాయిలో కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్న పార్థసారథి

కూటమిదే గెలుపు : పార్థసారథి

చాట్రాయి, మే 15: నూజివీడు అసెంబ్లీతో పాటు, రాష్ట్రంలో కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎం కావటం తథ్యమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి చాట్రాయిలో తన గెలుపు కోసం శ్రమించిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను పార్థసారథి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడిన కార్యకర్తల రుణం తీర్చుకుంటానన్నారు. చింతలపూడి ఎత్తిపోతలతో పాటు, మండలంలో చెరువులన్నీ అభివృద్ధి చేసి సాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, మామిడి, పామాయిల్ రైతుల సమస్యలు తీరుస్తానన్నారు. నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, బొట్టు లక్ష్మణరావు, అత్తులూరి శ్రీనివాస రావు, మరిడి చిట్టిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


సుధాకర్‌ను పరామర్శిస్తున్న దళిత నాయకులు

బూత్ ఏజెంట్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

కలిదిండి, మే 15 : కొండంగి గ్రామంలో కూటమి అభ్యర్థి తరపున పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న ఎన్.సుధాకర్‌పై దాడి చేసిన వైసీపీ రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలని టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు డిమాండ్ చేశారు. బుధవారం కొండంగిలో సుధాకర్‌ను కూటమి శ్రేణులు, దళిత నాయకులు పరామర్శించారు. దళిత నాయకులు బళ్ల రాజు, దాసరి క్రాంతి, ఈదా దుర్గారావు, యాళ్ల సుబ్బారావు, సానబోయిన విష్ణుమూర్తి, మారగా శ్రీను, రామకృష్ణ, మేరుగు విజయ్ తదితరులు పాల్గొన్నారు.


పశువుల ఎరువు పొలాలకు తరలిస్తున్న రైతులు

ఖరీఫ్ సాగుకు అన్నదాత సన్నద్ధం

చాట్రాయి, మే 15: మండలంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. భూముల్లో పశువుల ఎరువు చల్లి వేసవి దుక్కులు దున్నటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి దుక్కుల వలన భూమి గుల్లబారి పైర్లు ఏపుగా ఎదగటమే కాక, భూమిలో తేమ ఎక్కువ రోజులు నిల్వ ఉండటం, చీడపీడల బెడద తగ్గిపోవటం వలన మండలంలో ఎక్కువ శాతం రైతులు వేసవి దుక్కులు విధానం అనుసరిస్తున్నారు. ఉచిత విద్యుత్ విధానం అమలులోకి వచ్చిన తరువాత రైతులు వరి సాగు, జరీబు, మెట్ట, అన్ని రకాల భూముల్లో బోరుబావులు తవ్వించుకొని విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఖరీఫ్‌లో వరి, రబీలో మొక్కజొన్న పంటలు పండిస్తూ లాభాలు పొందుతున్నారు. తొలకరి వర్షాలు పడగానే చెరువుల్లోకి నీరు రాకపోయినా బోరుబావుల కింద వరినార్లు పోసి జూలై మొదటి వారంలోనే వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలు అలస్యమైనా బోరు నీటితో పంటలు పండిస్తున్నారు. మండలంలో 112 సాగునీటి చెరువుల కింద 9 వేల ఎకరాలు, తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 4200 ఎకరాలు మొత్తం 13,200 వరిసాగు భూమి ఉంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని అన్నదాతలు ఆశతో ఉన్నారు.

చోరీ కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 15 : ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పరిధిలోని మంచెం అప్పారావునగర్‌లో నివాసముంటున్న మంచెం జగన్నాధరావు ఆక్వాఫీడ్ సరఫరా చేస్తూ ఉంటారు. ఆయన కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ రాత్రి దొంగలు టీవీ, రూ.12 వేల నగదు అపహరించుకు పోయారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోస్టల్ బ్యాలెట్‌ను స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలిస్తున్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు

నూజివీడు, మే 15: నూజివీడు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తరలించారు. నూజివీడు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్‌లను దాఖలు చేయగా, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లను జిల్లాల వారీగా విభజించి వివిధ రాజకీయ పక్షాల నాయకుల సమక్షంలో ఆయా జిల్లాల స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. నూజివీడు ఆర్వో ఆర్డీవో వై.భవానీశంకరి పర్యవేక్షించారు.

ట్రిపుల్ ఐటీకి 25 వేల దరఖాస్తులు

నూజివీడు టౌన్, మే 15: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం అభ్యర్థుల నుంచి ఇప్పటి వరకు 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కంట్రోలర్ గోపాలరాజు తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ) క్యాంపస్‌లలో 4 వేల సాధారణ సీట్లు మరో 400 సూపర్ న్యూమనరీ సీట్లకు ఈ నెల 8వ తేదీ ఆర్జీయూకేటీ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈ నెల 25వ తేదీ వరకు 10వ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని వెల్లడించింది. దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభమైన మొదటి వారం రోజుల్లో నాలుగు క్యాంపస్‌లలోనూ అడ్మిషన్ల కోసం 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.


కూలీలకు మజ్జిగ పంపిణీ చేయిస్తున్న ఎంపీడీవో పద్మావతిదేవి

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించండి

ముసునూరు, ఏప్రిల్ 15: ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు వేసవిని దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి ఆదేశించారు. బుధవారం గోపవరంతోపాటు పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల వద్ద కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. కూలీలకు నీడ, ప్రథమ చికిత్స కిట్‌లు, మజ్జిగ పంపిణీ, మంచినీటి సౌకర్యం తదితర వాటిని ప్రతిరోజు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కూలీల మస్టర్లు రికార్డు తనిఖీ చేసి, కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. ఏపీవో రోజ్ లీల, ఈసీ జయప్రసాద్, టీఏలు, రవికుమార్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలింగ్ ప్రభుత్వం మార్పునకే సంకేతం

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు హరనాథ్

చాట్రాయి, మే 15: రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో అధిక శాతం ఓటింగ్ ప్రభుత్వం మార్పునకు సంకేతమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ అన్నారు. బుధవారం చాట్రాయిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈసారి నిశ్శబ్ద విప్లవం వెల్లువెత్తిందన్నారు. కొత్త ప్రభుత్వం వనరులను సద్వినియోగం చేసుకొని, అప్పులకు వెంపర్లాడకుండా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి కృషి చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని, సంపదను సృష్టించి ప్రజలపై పన్నుల భారం పడకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజధాని అమరావతి నిర్మాణం వెంటనే చేపట్టాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని విజ్ఞప్తి చేశారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దోమల నివారణతో డెంగీకి చెక్

నూజివీడు టౌన్, మే 15: దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూని అరికట్టవచ్చని, నూజివీడు డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో జగన్మోహన్ అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు యుపీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దోమలను అరికట్టేందుకు కృషిచేయాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.యలమంద, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా ట్రస్టు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



కైకలూరు, మే 15: స్థానిక షిర్డిసాయి ధ్యా నమందిరం సేవా ట్రస్టు ద్వారా ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కైకలూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రతి రోజూ సేవా ట్రస్టు ద్వారా దాతల సహకారంతో ప్రజలకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి మజ్జిగను పంపిణీ చేస్తున్నారు.



వీటీహెచ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

క్రీడా శిబిరాలు కిటకిట

నూజివీడు టౌన్, మే 15: చిన్నారుల్లో క్రీడలపై క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. నిన్న మొన్నటి వరకు పుస్తకాల పురుగులుగా మారిన చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచే దిశగా తల్లిదండ్రులు కృషి చేస్తున్నారు. నూజివీడు పట్టణంలో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు విక్టోరియా టౌన్ హాల్, నూజివీడు డీఏఆర్ కాలేజ్, బిస్ స్కూల్స్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుండటంతో తమ పిల్లలు క్రీడలో ప్రావీణ్యం సాధించేలా విద్యార్థుల తల్లిదండ్రులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ఆయా క్రీడా శిబిరాలు చిన్నారులతో కిటకిటలాడుతున్నాయి. నూజివీడు పట్టణంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్‌లో ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు.